ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 25.0

• మహాలక్ష్మీ నమోస్తుతే



అమ్మవారి ఆలయాలు శ్రావణశోభను సంతరించుకున్నాయి. శ్రావణమాసం తొలి శుక్రవారం జిల్లాలో అమ్మవారి ఆలయాల వద్ద మహిళా భక్తులు విశేష పూజలు చేశారు. సామూహికంగా కుంకు మార్చనలు, దీపారాధనలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చిత్రంలో ఆదిలక్ష్మీ అలంకరణలో ఏలూరు సత్రంపాడులోని సౌభాగ్య లక్ష్మీదేవి అమ్మవారు పూజలందుకుంది.

జనం ముందుకు వెళ్లలేక..

ముఖం చాటేస్తున్నారు!



ఒకవైపు వైసీపీ కేడర్‌లో ఇంతకు ముందున్న ఉత్సాహం లేదు. నాయకుల జాడ లేదు. అంతకంటే మించి నాలుగేళ్ల కైపు దిగి, చేష్టలుడిగి పార్టీ భవిష్యత్తు ఏమిటనే తర్జనభర్జన. ఇప్పటివరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన కార్యక్రమాలు తూతూ మంత్రంగానే సాగాయి. నియోజకవర్గ స్థాయిలో పార్టీలో చడీచప్పుడు లేదు. గతంలో సోషల్ మీడియా వేదికగా చెలరేగారు.. ఇప్పుడు వారి జాడ తగ్గింది. జిల్లా నాయకత్వం అధినాయకత్వం పిలుపు ఇస్తేనే తప్ప రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి లేదు. తాజాగా లిక్కర్ స్కాంలో సీనియర్ నేతలు ఒక్కొక్కరుగా జైలుబాట పట్టడం, జిల్లాకు చాన్నాళ్లు ఇన్‌చార్జిగా ఉన్న మిథున్‌రెడ్డి వంటి వారికి జైలు తప్పకపోవడం సహజంగానే పార్టీ కేడర్‌లో తీవ్ర గందరగోళం నింపింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

అధికారంలో ఉన్న ఐదేళ్లు కింద నుంచి పైవరకు అందరూ పేట్రేగిపోయేవారు. సోషల్ మీడియాలో అడ్డమైన కామెంట్లు చేసేవారు. ప్రతీదానిని రాజకీయం చేసేవారు. ఏదొక వంకన గొడవలకు దిగేవారు. ఎన్నికల వరకు వైసీపీలో ఇదే పరిస్థితి. ఆ తర్వాత ఏడాది కాలంగా వైసీపీలో నైరాశ్యమే తాండవిస్తోంది. ఇప్పుడు వైసీపీ క్షేత్రస్థాయిలోని కేడర్‌లో కొంత కదలిక తెచ్చేందుకు కొన్ని వారాలుగా శతవిధాలా ప్రయత్నిస్తోంది. అనేక మందిని జిల్లా కమిటీల్లో నామినేట్ చేశారు. మరికొందరిని నామినేట్ చేస్తామని హామీలు ఇస్తున్నారు. ఇంత చేసినా రాష్ట్రంలో సీనియర్ నేతలు ఒక్కొక్కరుగా వివిధ ఆరోపణలపై జైలుకు వెళ్తున్నారు. భవిష్యత్తులో బిగ్‌బాస్‌ను కూడా అరెస్టు చేస్తారన్న సమాచారం వారికి పుండు మీద కారం చల్లినట్టుగా ఉంది. గతంలో ఏ చిన్న విషయానికైనా వైసీపీ అనుకూలురు అతిగా రియాక్ట్ అయ్యేవారు. వీధుల్లోకి వచ్చి యాగి చేసేవారు. కాని ఇప్పుడు అరెస్టుల పర్వం కాస్తా జిల్లా స్థాయి సీనియర్ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రత్యేకించి నియోజకవర్గాల్లో కన్వీనర్లే పార్టీపరంగా కేడర్‌కు ఊతమిస్తారని భావించిన దానికి భిన్నమైన పరిస్థితులే నెలకొన్నాయి. అధినాయకత్వం పిలుపు ఇచ్చినప్పుడల్లా కన్వీనర్లు ఆ రోజు ప్రజలకు కనిపించి ఆ తర్వాత మాయమవుతున్నారు. కొందరైతే వ్యక్తిగత పనులకే పూర్తి సమయం కేటాయిస్తున్నారు. ప్రత్యేకించి పార్టీకి ఇప్పటికిప్పుడు చేయాల్సిందేమీలేదన్నట్టుగా మిన్నకుండిపోతున్నారు. ఫలితంగా ఎలాంటి సంకేతాలు లేక కేడర్ మెతకపడింది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోను దాదాపు ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయి.

వైసీపీ కేడర్‌లో నైరాశ్యం

- సీనియర్ల వరుస అరెస్టులు
- నాయకత్వం ఆదేశించినా ఒకట్రెండు కార్యక్రమాలతో సరి
- కేడర్ సరే.. నేతలెక్కడ అనే ప్రశ్న అన్నిచోట్ల..
- ఆఖరుకి అంతర్గత చర్చలకూ దూరమే

దెందులూరు నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ అబ్బయ్య చౌదరి ఇప్పుడు పార్టీకి పార్ట్‌టైమర్‌గా ఉన్నారు. వ్యక్తిగత పనుల కోసం ఆయన విదేశాల్లోనే ఎక్కువ కాలం గడుపుతున్నారు. కొన్నాళ్లపాటు నియోజకవర్గానికి వచ్చి స్థానికులతో భేటీ అయ్యి ఒకటి రెండు కార్యక్రమాలకే పరిమితమవుతున్నారు. ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ జయప్రకాశ్ తన శక్తి మేరకు కేడర్‌ను కూడగట్టుకుని కలెక్టరేట్ వద్ద నిరసనల బాధ్యత మోస్తున్నారు. పార్టీ అధినాయకత్వంతో పూర్తి టచ్‌లో ఉన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో పార్టీ కన్వీనర్ వాసుబాబు ఇంతకు ముందున్నట్టుగా స్పీడుగా లేరు. పోలవరం నియోజకవర్గంలో బాలరాజు పాత్ర ఇటువంటిదే. నూజివీడులో ప్రతాప అప్పారావు సాధ్యమైనంత మేర కేడర్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. చింతలపూడిలో గతంలో మాదిరిగానే పార్టీ నేతల మధ్య వైరుధ్యాలు కొనసాగుతున్నాయి. కైకలూరు నుంచి దూలం నాగేశ్వరరావు వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యత వహిస్తూనే తన నియోజక వర్గంలో పార్టీ కార్యక్రమాలను నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

పార్టీ భవిష్యత్తేంటి ?

ఎన్నికలు పూర్తయిన తర్వాత ఏడాది కాలంలోనే పార్టీ కొన్ని నియోజకవర్గాల్లో అంతంత మాత్ర స్థితికి రావడం పార్టీలో గందరగోళం నింపింది. నియోజకవర్గ స్థాయిలో సమీక్షలు లేకపోవడం, తగిన ప్రోత్సాహం కొరవడడం, ఇప్పుడు లిక్కర్ స్కాంలో పార్టీ ప్రతిష్ట కొంత సన్నగిల్లిన నేపథ్యంలో కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకు తగినంత స్థాయిలో నాయకులు పని చేయడంలేదు. ఉమ్మడి జిల్లా నుంచి అప్పట్లో మంత్రులుగా కొనసాగిన వారు ఇప్పుడు దాదాపు సైలెంట్‌గా, తమ నియోజకవర్గానికే పరిమితమయ్యారు. కనీసం రీజనల్ స్థాయి కో-ఆర్డినేటర్లు కార్యకర్తలను సాధ్యమైనంత మేర ప్రోత్సహించాలనుకున్నా అదీ చేయలేకపోతున్నారు. ఇలాంటి తరుణంలో పార్టీ భవిష్యత్ ఎలా ఉండబోతుందంటూ కార్యకర్తలు దగ్గర నుంచి సీనియర్ నేతల వరకు ఆందోళనలో ఉన్నారు.

బొత్స వచ్చి వెళ్లినా..

సుపరిపాలనలో తొలి అడుగు పేరిట తెలుగుదేశం ప్రభుత్వం ఈనెల మొదటి వారం నుంచి ప్రజల వద్దకు వెళ్లడానికి కార్యాచరణ రూపొందించుకుంది. దీనికి భిన్నంగా బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ పేరిట నెల రోజుల పాటు ప్రజల ముందుకు వెళ్లాలని, ఊరూవాడా ప్రజలను కూడగట్టుకుని స్లైడ్‌లు వేసి అందరికీ వివరించాలని, పత్రికా సమావేశం నిర్వహించి సూపర్-6 విషయాన్ని ప్రస్తావించాలని వైసీపీ అధినాయకత్వం కేడర్‌కు పిలుపునిచ్చింది. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు ఈ కార్యక్రమాన్ని తీసుకెళ్లాలని ఆదేశించింది. ఇరవై రోజుల క్రితం సీనియర్ నేత బొత్స సత్యనారాయణ పార్టీ నేతలు, కేడర్‌తో సమావేశం జరిపారు. ఆ తర్వాత నియోజకవర్గాల్లో, గ్రామస్థాయిలో పార్టీ చెప్పింది అమలు చేయలేకపోయారు. లిక్కర్ స్కాంలో నేతలు అరెస్టు కావడం, కోట్లాది రూపాయలు వెనుకేసుకున్నారని, జనం ఆరోగ్యాన్ని దెబ్బతీశారని కొందరు ప్రాణాలు పోవడానికి కారణమయ్యారనే సిట్ నివేదికలను అటు ఖండించలేక, ఎదురుదాడి చేయలేక క్షేత్రస్థాయిలో ప్రజలకు వైసీపీ నేతలు ముఖం చాటేస్తున్నారు. ఇప్పటివరకు పార్టీ నాయకత్వం క్షేత్రస్థాయిలో ఎలా డీలాపడిందో ఈ కార్యక్రమం అమలులోకి వచ్చేసరికి బయటపడింది.

విష జ్వరాల బారిన పడొద్దు

- డీఎంహెచ్‌వో పీజే అమృతం

ఏలూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి):మలేరియా, డెంగీ, చికెన్ గున్యావంటి విషజ్వరాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే. అమృతం సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా చేస్తారని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు.

వ్యాయామోపాధ్యాయుడి సస్పెన్షన్

ఏలూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్కూలులో బాలికల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారన్న అభియోగాలపై కలిదిండి జడ్పీ హైస్కూలు వ్యాయామోపాధ్యాయుడు రత్నదాస్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. వ్యాయామోపాధ్యాయుడిపై వచ్చిన ఫిర్యాదుపై ఏలూరు డీవైఈవో విచారణ జరిపి, అందజేసిన నివేదిక ఆధారంగా అతనిని సస్పెండ్ చేసినట్టు వివరించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి : జేసీ

ఏలూరుసిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి):వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేలా శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖాధికారులు కృషి చేయాలని జేసీ ధాత్రిరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రైతులకు లాభదాయమైన సన్నరకం వరి వంగడాలు, ఖరీఫ్-2025 ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కనీసం ఈసారి 50 శాతం తగ్గకుండా సన్నరకం వరి పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. తక్కువ సాగు ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు వర్షాకాలంలో ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి డ్రైయర్లు, ప్లాట్ ఫారమ్‌లు ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ చేయాలని, ఉన్న ప్లాట్ ఫారంలు మరమ్మతులు ఉంటే చేయాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారిని జేసీ ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి , డీఎస్‌వో విలియమ్స్, జిల్లా రవాణా అధికారి కృష్ణ, డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డా.ఫణి కుమార్, డా.గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

పీ-4పై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

ఏలూరుసిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు ఉద్దేశించిన పీ-4 కార్యక్రమాన్ని మనస్సు పెట్టి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి పీ-4 పై జిల్లా కలెక్టర్లు , ఎమ్మెల్యేలు సంబంధిత అధికారులతో శుక్రవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి, డీఆర్వో విశ్వేశ్వరరావు, సీపీవో వాసుదేవరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ గోవిందరాజులు, జిల్లా ఉద్యానశాఖాధికారి రామ్మోహన్ , మత్స్యశాఖ జేడీ నర్సయ్య, జడ్పీ డిప్యూటీ సీఈవో భీమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ పీ-4 అమలులో బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానించాలన్నారు. బంగారు కుటుంబాల దత్తత, మార్గ దర్శకుల ఎంపిక, నమోదు క్షేత్రస్థాయిలో వేగవంతంగా పూర్తిచేసి ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.



అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ధ్వంసం

■ లోపలి పేజీలో..

వీడని ముసురు

ఏలూరుసిటీ/పోలవరం/కామవరపుకోట, జూలై 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో ఎడతెరపిలేకుండా నానుడు వర్షాలు కురుస్తు న్నాయి. బలమైన గాలులు వీస్తున్నాయి. గ్రామాల్లోని గ్రావెల్, మట్టి రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. ఈ వర్షాలు సార్వా పంటల సాగుకు అనుకూలిస్తాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. పోలవరంలో మెయిన్ బజార్, కొత్తపేట, బెస్తావీధి, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల గ్రామాల్లో ఏటిగట్టుకి దిగువన ఉన్న నివాసాల్లోకి వర్షపునీరు చేరి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు. పోలవరం- రేపల్లెవాడ రోడ్డుపైన గోతుల్లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. కామవరపుకోట మండలంలో వర్షాల కారణంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ సజావుగా లేక రోడ్లపైకి మురుగునీరు పొంగిపొర్లడంతో అయా కాలనీ వాసులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తడికలపూడి-రావికంపాడు రహదారిలో గోతులు ఉండ డంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ఏలూరు రూరల్ మండలంలో 23.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం11.7మి.మీగా నమోదైంది. టి.నరసాపురం 21, జంగారెడ్డిగూడెం 20.4, బుట్టాయిగూడెం 19.8, జీలుగుమిల్లి 19.4, కొయ్యలగూడెం 18.2, చింతలపూడి 15.2, దెందులూరు 15, కామవరపుకోట 13.4, పెదవేగి 13.4, ఏలూరు అర్బన్ 13.4, నూజివీడు 13.2, వేలేరుపాడు 12, ద్వారకాతిరుమల 11, ముసునూరు 10.2, లింగపాలెం 10.2, పెదపాడు 8.8, ఆగిరిపల్లి 8.4, పోలవరం 8.4, నిడమర్రు 7, చాట్రాయి 6.8, భీమడోలు 6.6, కుక్కునూరు 6.4, కైకలూరు 5.8, కలిదిండి 5.4, ముదినేపల్లి 5, ఉంగుటూరు 4.8, మండవల్లి 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పెరుగుతున్న గోదావరి

పోలవరం : ఎగువ రాష్ట్రాల్లో , పోలవరం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గత రెండు రోజులుగా గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 24.80 అడుగులకు చేరుకోవడంతో కుక్కునూరు, వేలేరుపాడు, మండలాలలో ముంపు గ్రామాల ప్రజలు మళ్ళీ ముంపు భయంతో బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే కొంతమంది పునరావాస గ్రామాల్లోనే ఉండగా, ఇటీవల వరద ప్రభావం తగ్గి గ్రామాలకు చేరిన ముంపు గ్రామాల ప్రజలు ముంపు భయంతో మళ్లీ సరంజామా సర్దుకునే పనిలో పడ్డారు.

ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా చర్యలు తీసుకోండి..

నూజివీడు :వర్షాల కారణంగా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. వాతావరణశాఖ భారీ వర్షాలు హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలోని పరి స్థితిపై అధికారులను శుక్రవారం మంత్రి ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయ చర్యలు చేపట్టాలన్నారు.తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు.

తమ్మిలేరు రిజర్వాయరుకు స్వల్పంగా వరద నీరు

చింతలపూడి : చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయరులోకి శుక్రవారం నుంచి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు అధికారులు మాట్లాడుతూ ఎగువ నుంచి వరద రావడం లేదని, కేవలం క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు వాగులోకి వరద చేరి రిజర్వాయరులోకి సుమారు 500 క్యూసెక్కులు వస్తోందన్నారు. ప్రస్తుతం నీటిమట్టం 333 అడుగులు ఉందని, 348 అడుగులకు చేరితే గేట్లు తెరిచే అవకాశం ఉంటుందని, ప్రస్తుతం ఇబ్బంది లేదన్నారు.



ఖైదీలకు అందుతున్న ఆహారాన్ని రుచి చూస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

జిల్లా జైలు సందర్శన

ఏలూరు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు వన్‌టౌన్‌లోని జిల్లా జైలును ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలలో జరిగే తనిఖీలలో భాగంగా జిల్లా జైలును సందర్శించినట్టు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన, న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ఉచిత న్యాయవాదిని నియమించి వారి కేసులను వాదిస్తారని తెలిపారు. జైలు పర్యవేక్షకులు సీహెచ్‌ఆర్‌వీ స్వామి, జైలర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సులను సంసిద్ధంగా ఉంచండి : డీపీటీవో

నూజివీడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్న నేపథ్యంలో బస్సులను సంసిద్ధంగా ఉంచాలని ఏలూరు డీపీటీవో షేక్ షబ్నం సూచించారు. నూజివీడు బస్ డిపోను శుక్రవారం సందర్శించారు. బస్సుల కండీషన్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లలో తాగునీరు, టాయిలెట్స్, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు పరిధిలోకి..

హైస్కూల్ ప్లస్‌లు!



- జిల్లాలో 30 మందికి పైగా విద్యార్థులున్నవి పన్నెండే
- ఈ ఏడాదికి పీజీటీలతోనే బోధన

ఏలూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యను బోధిస్తున్న హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణ బాధ్యతలను పాఠశాల విద్యాశాఖ నుంచి ఇంటర్‌బోర్డుకు అప్పగించే దిశగా ప్రభుత్వం సంకేతాలిచ్చింది. ఈ మేరకు కనీసం 30 మందికి పైగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వున్న హైస్కూల్ ప్లస్‌లను ఇంటర్‌బోర్డుకు బదలాయించేందుకు కసరత్తు చేపట్టనున్నారు. ఎంపిక చేసిన ప్రభుత్వ/జడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు ఇంటర్మీడియట్ చదువుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అదే స్కూలు ప్రాంగణంలో ప్లస్ టూ విద్యను కొనసాగించేలా 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం హడావుడిగా హైస్కూల్ ప్లస్ పేరిట ప్రారంభించిన విషయం విదితమే. ఆర్భాటంగా హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించడంలో చూపించిన శ్రద్ధను సంబంధిత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో, బోధనకు అధ్యాపక సిబ్బందిని నియమించడం, కనీసం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించడంలో తొలి రెండేళ్లలో దృష్టి పెట్టిన సందర్భాలు లేవు. దీనికనుగుణంగానే ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్రం మొత్తం మీద హైస్కూల్ ప్లస్‌లదే అథమస్థానం. మరోవైపు ఈ పాఠశాలల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డుల మధ్య సమన్వయం లేదు. హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ అడ్మిషన్లను, పరీక్షలను ఇంటర్‌బోర్డు పర్యవేక్షిస్తుండగా, బోధనా సిబ్బంది పాఠశాల విద్యాశాఖలో నియమితులైన స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులున్నారు. స్కూల్ అసిస్టెంట్లలోనే సంబంధిత బోధన సబ్జెక్టులో కనీసం **(మిగతా 8వ పేజీలో)**

సైన్సు, ఆర్ట్స్ గ్రూపులతో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్‌లను సంస్కరించే క్రమంలో కనీసం 30 మంది విద్యార్థులున్న వాటిని ఇంటర్ బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం జిల్లాలోని 26 హైస్కూల్ ప్లస్‌లలో నిర్దీత సంఖ్యలో బాలబాలికలున్నవి (ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి) కేవలం 12 మాత్రమేనని గుర్తించారు. మిగతా వాటిలో 4 నుంచి 25 మంది వరకే ఎన్‌రోల్‌మెంట్ ఉంది. ఒకదశలో విద్యార్థుల సంఖ్య ఆశించిన విధంగా లేని హైస్కూల్ ప్లస్‌లను ఎత్తివేయడం లేదా వాటిలో చదువుతున్న విద్యార్థులకు సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించి, వారికి ప్రయాణ ఖర్చులు(ట్రావెల్ అసిస్టెన్స్)ను చెల్లించే ప్రతిపాదన వచ్చింది. అయితే ఈ ఏడాదికి ఆ ప్రతిపాదనపై ఏ నిర్ణయం తీసుకోకుండానే కొనసాగింపునకే మొగ్గు చూపారు. తాజా ప్రతిపాదన ప్రకారం 30 మందికి పైగా విద్యార్థులున్న హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణను

30 మందికి పైగా విద్యార్థులున్నవన్నీ ఇంటర్ బోర్డు పరిధిలోకి..

ఇంటర్‌బోర్డుకు అప్పగించనున్నారు. ఈ ఏడాదికి పీజీటీలనే అన్ని హైస్కూల్ ప్లస్‌లలో బోధనకు కొనసాగిస్తారు. ఇంటర్‌బోర్డు అజమాయిషీలోకి వీటిని తీసుకొస్తున్నందున బోధనకు జూనియర్ లెక్చరర్లను నియమించాల్సి ఉంటుంది. కాంట్రాక్టు/అవుట్‌సోర్సింగ్ పద్ధతిన బోధనా సిబ్బందిని నియమిస్తారా లేక అర్హతలున్న స్కూల్ అసిస్టెంట్లనే రెగ్యులర్ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్లుగా నియమించాలని ఉపాధ్యాయులు చేస్తున్న చిరకాల డిమాండ్‌ను ఆమోదిస్తారా.. అనే దానిపై స్పష్టత రావాల్సిఉంది. కాగా నిర్దీత సంఖ్యలో విద్యార్థులు లేని హైస్కూల్ ప్లస్‌ల కొనసాగింపు లేదా నిర్వహణపై వచ్చే విద్యాసంవత్సరం (2026-27) ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణలో సంస్కరణలపై ఇంటర్‌బోర్డు జిల్లావర్గాలను సంప్రదించగా ఇంతవరకు ఎటువంటి అధికారిక సమాచారం తమకు అందలేదని వివరించాయి.

అభివృద్ధి అంటేనే చంద్రబాబు

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



ఏలూరు టూటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరు చెబితేనే రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుకొస్తారని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఏలూ రులో శుక్రవారం సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజాప్రతినిధులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో తొలిఅడుగు కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో 20 వేల కోట్లతో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ సుస్థిర పాలనే ధ్యేయంగా సీఎం పని చేస్తున్నారన్నారు. మేయర్ నూర్జహాన్ ఏడాది కూటమి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి అందజేశారు. ఒక మహిళకు వ్యాపారం నిమిత్తం ఎమ్మెల్యే సొంతఖర్చులతో తోపుడు బండిని అందజేశారు. ఏపీ అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, పార్టీ పరిశీలకుడు వల్లి, ఏపీ మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్ దుర్గాభవాని, నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం మునిసిపల్ కమిషనర్ చాంబర్‌లో అగ్నిప్రమాదం

- దగ్ధమైన కంప్యూటర్, ఏసీ , ఫ్యాన్‌లు, లైట్లు
- విలువైన డాక్యుమెంట్స్‌కు నష్టం లేదు : కమిషనర్

■ లోపలి పేజీలో..

శ్రావణ శోభ

కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



భీమవరం మావుళ్లమ్మను దర్శించుకున్న భక్తులు

భీమవరం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభం కావడంతో అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మావుళ్లమ్మ ఆలయం, సోమేశ్వర, జనార్దనస్వామి ఆలయం, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్లు, శ్రీరాంపురం కనకదుర్గ, పలు వార్డులలో అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు.

ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

పెనుగొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి శుక్రవారం పెనుగొండ వాసవి శాంతి ధామ్ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి గాజుల అలంకరణ

పెనుమంట్ర, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయాలు శుక్రవారం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. మార్టేరు శివారు శివరావుపేటలోని కనకదుర్గను మట్టి గాజులతో అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ చైర్మన్ తేతలి రాజారెడ్డి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో గాజులతో అలంకారం చేశారు. పెనుమంట్ర కనకదుర్గమ్మ అమ్మవారికి పంచామృతా లతో అభిషేకాల నిర్వహించి కుంకుమార్చన నిర్వహించారు. మార్టేరు మావుళ్లమ్మ, కామాక్షి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.



ప్రత్యేక అలంకరణలో మార్టేరులో కనకదుర్గమ్మ, పెనుగొండ వాసవీ మాత



కేక్ కట్ చేస్తున్న బిషప్ జయరావు, ఎమ్మెల్యే బడేటి చంటి

జయరావు సేవలు స్ఫూర్తిదాయకం

బిషప్ పదవిలో పన్నెండేళ్లు పూర్తి

ఏలూరుటూటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సామాజిక సేవలో ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ జయరావు పొలిమేర కృషి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు కథోలిక పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ డాక్టర్ జయరావు బిషప్‌గా పదవి చేపట్టి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ అభినందించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, ఇడా చైర్మన్ శివప్రసాద్, టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జుంజు మోజేష్, లంకపల్లి మాణిక్యాలరావు, పాల్గొన్నారు. అనంతరం అమలోద్భవి మాత కెథడ్రల్ దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిధిగా పాల్గొన్న హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ ఆంథోని పూల దివ్యబలి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ ఇంజమాల మైఖెల్, పాదర్ కే.బాలరాజు, ఫాదర్ రెవరెండ్ బాల, అబ్రహం మాస్టారు, ఫాదర్ ఇమ్మానియేలు, గురువులు, పీఠాధిపతులు, మఠవాసులు, తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ నజీర్ నుంచి అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త సునీత

మార్టేరు వరి పరిశోధన స్థానం

శాస్త్రవేత్త సునీతకు ఉత్తమ అవార్డు

ఎన్జీ రంగా వర్సిటీ స్నాతకోత్సవంలో ప్రదానం చేసిన గవర్నర్

పెనుమంట్ర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ వరి పరిశోధనా స్థానంలో బ్రీడర్ సైన్స్ విభాగం శాస్త్రవేత్త వై.సునీత ఉత్తమ అవార్డు అందుకున్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూర్ స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో ఈ నెల 24న జరిగిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి డాక్టర్ వై.సునీత అవార్డు అందుకున్నారు. 2011 నుంచి నూతన వరి వంగడాల రూపొందించడంలో విశిష్ట సేవలకు గాను మెరిటోరియస్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె మార్టేరు (18 రకాలు), బాపట్ల (5 రకాలు) వరి పరిశోధనా స్థానాల నుంచి మొత్తం 23 వరి రకాల అభివృద్ధి, విడుదలలో భాగస్వామి. అదనంగా 1 జన్యు స్టాక్ అభివృద్ధి చేశారు. జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత జర్నల్స్‌లో 99 పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. 15 మంది పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. 7 పరిశోధనా సంస్థలలో జీవిత కాల సభ్యురాలిగా కొనసాగుతున్నారు. సునీత ప్రస్తుతం మధ్య కాల వ్యవధి కలిగిన వరి రకాల అభివృద్ధిలో పరిశోధనలు చేస్తున్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఆర్‌ఆర్‌ఐ), డీబీటీ (బయోటెక్నాలజీ విభాగం) సహకారంతో అనేక ప్రాజెక్టులు చేస్తున్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్, ఇతర శాస్త్రవేత్తలు, సిబ్బంది సునీతకు అభినందనలు తెలిపారు. ఏడీఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, సిబ్బంది మరింత కృషి చేసి మార్టేరు వరి పరిశోధనా సంస్థను ఉన్నత స్థాయిలో నిలపాలన్నారు.

పట్టణాల్లో ప్లాస్టిక్ భూతం

ఆంధ్రజ్యోతి పరిశీలన





పట్టణాల్లో ప్లాస్టిక్ భూతం స్వేచ్ఛగా విహరిస్తోంది. కేన్సర్ రూపంలో ప్రాణాలను కబళించే ప్రమాదం ఉందని తెలిసినా ప్రజలు పట్టించుకోవడం లేదు. అధికారులు అలసత్వం వీడడం లేదు. పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.. అధికారులు వరుస సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గలేదు. వ్యాపారులను విక్రయించవద్దని, ప్రజలను వాడవద్దని అధికారులు చెబుతున్నారు. కవర్లు ఎక్కడ తయారవుతున్నాయి, రవాణా, విక్రయాలపై మాత్రం పర్యవేక్షణ కొరవడింది. ప్లాస్టిక్ నియంత్రణ చర్యలపై ఆంధ్రజ్యోతి పరిశీలన..



- యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వాడకం
- ఎక్కడపడితే అక్కడ విక్రయాలు
- ప్రజలకు తక్షణ సౌకర్యం
- అధికారుల నామమాత్రపు చర్యలు
- నియంత్రణలో యంత్రాంగం విఫలం

నియంత్రణలో విఫలం

పాలకొల్లు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నియంత్రణలో అధికారుల విఫలమయ్యారు. మునిసిపాలిటీ అధికా రులు కొన్ని రోజులు దుకాణాలపై దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత కవర్ల వినియోగం షరా మామూలే. కొన్ని దుకాణల్లో కవర్లు ఇవ్వడం లేదని బోర్డులు పెట్టినా వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. దీనితో వ్యాపారులు చాటుమాటుగా కవర్లు ఇస్తూనే ఉన్నారు. కింది స్థాయి అధికారులు ప్లాస్టిక్ వినియోగం నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. ప్లాస్టిక్ కవర్లు ఉత్పత్తిపై చర్యలు లేకుండా వ్యాపారులపై చర్యలు తీసుకోడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

నిషేధం వట్టి మాట!

భీమవరం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పుగా ఉన్న ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధం పట్టణంలో వట్టి మాటగా మిగిలింది. దాదాపు 10 నెలలగా నిషేధం అమలులో ఉన్నా పట్టణంలో రోజుకు 80 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణలో ప్లాస్టిక్ కవర్లే అధికం. జిల్లా కేంద్రమైన భీమవరం నుంచే ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలుకు కలెక్టర్ నాగరాణి శ్రీకారం చుట్టారు. మునిసిపల్ అధికారులు దాడులు చేసి వినియోగం, విక్రయాలు కట్టడి చేసినా వాడకం ఆగలేదు. వారం రోజుల క్రితం తోపుడుబండి వ్యాపారి వద్ద జాయింట్ కలెక్టర్ కవర్లను పట్టుకుని అవగాహన కల్పించారు. అనంతరం అధికారులతో సమీక్షలో ప్లాస్టిక్ నియంత్రణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దాడులు నామమాత్రం

తాడేపల్లిగూడెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో ప్లాసిక్ కవర్ల వాడకం సర్వసాధారణం. కూరగాయలు, కిరాణా దుకాణాలు, పండ్ల బండ్లు, పాల బూత్‌ల వద్ద కవర్ల వినియోగం ఎక్కువగా జరుగుతుంది. అధికారులు నామమాత్రపు దాడులతో పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాగుతున్నాయి. చిల్లర వ్యాపారులకు కవర్లను విక్రయించే వారిని మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో 20 మైక్రాన్‌కంటే ఎక్కువ మందం ఉండే కవర్లను వినియోగించే అవకాశం ఇచ్చారు. కనీసం ఆదిశగా కూడా వ్యాపారులు చేయడం లేదు. ర్యాలీలు ప్రచారాల ప్రభావం ప్రజలలో కనిపించడం లేదు. అధికారులు దాడులు చేసి అధిక మొత్తంలో ఫైన్లు వేస్తే తప్ప అదుపులోకి రావని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

తనిఖీలతో సరి..!

తణుకు, జూలై 25(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గలేదు. తణుకు పట్టణంలో అధికారులు తనిఖీలతో చేతులు దులిపేసుకుంటున్నారు. ఒకటి, అర కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధించినా కవర్ల వాడకం కొనసాగడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనం.

తరుచూ దాడులు, జరిమానా

నరసాపురం పట్టణంలో సింగిల్ లేయర్ ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించాం, తరుచూ తనిఖీ చేస్తున్నాం. ప్రత్యేక టీం కూడా ఏర్పాటు చేశాం. విక్రయాలు సాగిస్తున్న పలువురు వ్యాపారులకు జరిమానా విధించాం. వ్యాపారులు, ప్రజలకు కవర్ల వాడకంపై అనర్థాలను వివరించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

అంజయ్య, మునిసిపల్ కమిషనర్, నరసాపురం

రూ 3.5 లక్షలు జరిమానా

పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటున్నాం. గత అక్టోబర్ నుంచి ఇప్పటివరకు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారి నుంచి రూ.3.5 లక్షలు జరిమానా వసూలు చేశాం. ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి దాడులు చేయిస్తున్నాం. వాటిని గుర్తించి చర్యలు చేపడుతున్నాం. వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు తెలిసేలా ప్రచారం చేస్తున్నాం.

కె.రామచంద్రారెడ్డి, భీమవరం మునిసిపల్ కమిషనర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పర్యావరణంపై దుష్ప్రభావం చూపే ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలి, ప్లాస్టిక్‌తో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది.. దీనితో గుడ్డ సంచులువాడితే చాలా మేలు. సామాజిక మాధ్యమాల ద్వారా పేపర్లు, టీవీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి.

మీసాల రాజేంద్ర, పాలకొల్లు

అందరూ సహకరించాలి



ప్లాస్టిక్ కవర్లు వినియోగం ప్రజలు, పర్యావరణానికి హాని కలిగిస్తుంది. కవర్ల వాడకం కాకుండా ప్రత్యామ్నాయ సంచుల వినియోగంతో ప్రతి ఒక్కరు సహకరించాలి. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం, అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు తోడుగా నిలబడాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు అందరూ సహకరించాలి.

వెంకటేశ్వరరావు, తణుకు

తనిఖీలు ముమ్మరం చేయాలి



ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలి. మూడు నెలలు నుంచి అధికారులు తనిఖీలు చేయడంతో పాటు వాటిని విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమానా విధిస్తున్నారు. అయినప్పటికి కవర్లు వాడకం మానలేదు. వ్యాపార సంస్థలకు గట్టి ఆదేశాలతో పాటు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

మొనవర్తి వెంకటేశ్వరరావు, తణుకు

అవగాహన కల్పించాలి



సరుకులు తీసుకెళ్లేందుకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో కవర్లను వినియోగిస్తున్నాం. చాలా కాలం నుంచి అలవాటుగా మారింది. దీనివల్ల కలిగే అనార్థలపై ప్రజలకు ఇప్పుడిప్పుడు అవగాహన కలుగుతుంది. అధికారులు విస్తృతంగా సదస్సులు నిర్వహించాలి. అవగాహన కల్పించడం ద్వారా వినియోగం తగ్గుతుంది.

చెరుకూరి బాలాజీ, నరసాపురం

చెక్ డ్యాం కొట్టుకుపోయింది

ఐదేళ్లుగా పట్టించుకోలేదు!

- తమ్మిలేరుపై వెంకటాపురం వద్ద 2020 వరదకు చెక్‌డ్యామ్ ధ్వంసం
- మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లిన రైతులు
- నిర్మాణానికి హామీ
- మంజూరు కాని నిధులు



వెంకటాపురం వద్ద తమ్మిలేరులో కొట్టుపోయిన చెక్ డ్యామ్

ముసునూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం వెంకటాపురం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన చెక్‌డ్యామ్ 2020లో వరదలకు కొట్టుకుపోయింది. ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదు. చెక్‌డ్యామ్ వల్ల బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామాల పరిధిలో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందేది. గత ఏడాది చెక్‌డ్యామ్ నిర్మాణం చేపడతామని అన్ని రాజకీయ పార్టీలు హామీలు నీటి మూటలే. చెక్‌డ్యామ్ వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భ జలనీటి మట్టం పెరుగుతుంది. తద్వారా వ్యవసాయ బోరుల్లో సైతం నీటి మట్టం పెరిగి ప్రజల వ్యవసాయ అవసరాలు తీరాయి. తొలుత 2009లో రూ.6 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మించగా 2020 వరదలకు కొట్టుకుపోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం దీని వైపు కన్నెత్తి చూడలేదు. నాటి నుంచి పంటలకు సకాలంలో నీరు అందక రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

నిధులు మంజూరు చేయండి..

2024 ఎన్నికల్లో నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి చెక్‌డ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారంలోకి రాగానే నిర్మిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ తాను ఇచ్చిన హామీని అమలు చేయడానికి మంత్రి సంబంధిత అధికారులను పంపి ప్రతిపాదనలు రూపొందించి సుమారు 8నెలలైంది. ఇంత వరకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చెక్‌డ్యామ్‌ను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి పార్థసారథి ఆదేశాలతో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించినట్లు నూజివీడు ఇరిగేషన్ డీఈ వై.అర్జునరావు తెలిపారు. చెక్ డ్యామ్ నిర్మాణానికి సుమారు రూ.3.5కోట్లు అవసరమని ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.

బీడువారిన భూములు



వేల్పుచర్లలో 7 చెరువులకు ఈ చెక్‌డ్యామ్ నుంచి సప్లైయి ఛానల్ ద్వారా చేరిన నీటితో పంటలు పండేవి. చెక్‌డ్యామ్ కొట్టుపోయిన నాటి నుంచి సుమారు 700 ఎకరాలు పంట పొలాలు బీడు భూములుగా మారాయి. ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణానికి చర్యలు చేపట్టి, రైతులకు మేలు చేయాలి

తుమ్మల నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు, వేల్పుచర్ల

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం



వైసీపీ హయాంలో వరదలకు చెక్‌డ్యామ్ కొట్టుపోయింది. ఐదేళ్ల నిర్లక్ష్య పాలన రైతులకు శాపంగా మారింది. ఈ చెక్ డ్యామ్ నుంచి సుమారు 700 ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండేవి. ప్రస్తుతం వర్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టాలి.

కాట్రు రామస్వామి, రైతు, బలివే

మాజీ మంత్రి ముందు చూపు!

భూమి వినియోగ మార్పిడికి దరఖాస్తు

రెవెన్యూ శాఖ తర్జనభర్జన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయ ప్రతిపాదనల నేపథ్యంలో వైసీపీకి చెందిన మాజీమంత్రి ముందస్తు వ్యూహం రచించారు. వెంకట్రామన్నగూడెం ప్రాంతంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి వినియోగ మార్పిడి (కన్వర్షన్)కి దరఖాస్తు చేశారు. దీనిపై రెవెన్యూ శాఖ తర్జన భర్జన పడుతోంది. ఇటీవల భూ వినియోగ మార్పిడి దరఖాస్తులు తగ్గిపోయాయి. కన్వర్షన్ ఫీజు రద్దు ప్రకటనలతో ఎవరూ దరఖాస్తు చేయడం లేదు. క్షేత్రస్థాయిలో మెరకచేసి లేఅవుట్ వేసేందుకు సిద్ధమవుతున్నా రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోలేకపోతోంది. ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్న ఉద్దేశంతో రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోతున్నారు. జిల్లాకు చెందిన మాజీమంత్రి మాత్రం వెంకట్రామన్నగూడెం ప్రాంతంలో భూమి కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. విమానాశ్రయం వస్తే చదరపు గజాల రూపంలో పరిహారం తీసుకోవడానికి ఇది ఒక ఎత్తుగడ అని జిల్లాలో చర్చ జరుగుతోంది.

నిర్మాణాలుంటేనే గజాల్లో..

ప్రస్తుతం తాడేపల్లిగూడెం విమానాశ్రయ జాబితాలో ఉంది. భూసేకరణపై ఇటీవల కలెక్టర్ తాడేపల్లిగూడెం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. భూములు అందుబాటులో ఉన్నాయని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన తర్వాత ఫీజిబిలిటీ కమిటీ సర్వే నిర్వహించి కేంద్రానికి నివేదిక ఇస్తుంది. ప్రయాణికులతో పాటు, కార్గోకు ఇక్కడ అవకాశాలు మెండుగా ఉన్నాయి. పరిహారం విషయంలో రైతుల్లో అలజడి నెలకొంది. రైతులు ఆశించిన విధంగానే పరిహారం ఉంటుందని ఎమ్మెల్యే బొలిశెట్టి భరోసా ఇస్తున్నారు. కాగా మాజీమంత్రి భూమి కన్వర్షన్ దరఖాస్తు అందరిలో ఆసక్తి రేపింది. గజాల్లో పరిహారం సాధించేందుకు మాజీమంత్రి ఎత్తుగడ వేశారంటూ బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. నిర్మాణాలకు మాత్రమే గజాల్లో పరిహారం ఉంటుంది. లేదంటే వ్యవసాయ భూముల తరహాలోనే సేకరిస్తారు.

ద్వారకాతిరుమల సమాచారం



పవిత్రాలు ధరించిన స్వామి, అమ్మవార్లు

వచ్చే నెల 7 నుంచి 10 వరకు

శ్రీవారి పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, జూలై 25(ఆంధ్రజ్యోతి):చిన్న వెంకన్న దివ్యపవిత్రోత్సవాలు వచ్చే నెల ఏడో తేదీ నుంచి 10 వరకు జరుగుతాయని ఆలయ ఈవో ఎన్‌వీ సత్య నారాయణ మూర్తి తెలిపారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ఏటా వీటిని నిర్వహిస్తారు. 7న సాయంత్రం అంకురార్పణ, 8న పవిత్రాధి వాసం, 9న పవిత్రారోపణ, 10న మహా పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. ఆయా రోజుల్లో శ్రీవారి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో వివరించారు.

శని, ఆదివారాల్లో నిత్య కార్యక్రమాలు

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని, ఆదివారాల్లో నిత్య కార్యక్రమ వివరాలు..

- ఉదయం 3.30 గంటలకు తీర్థపు బిందె సేవ
- 4 గంటలకు సుప్రభాత సేవ
- 4.30 గంటలకు ప్రాతః కాలార్చన, బాలభోగం, గోష్ఠి
- 5.30 గంటల నుంచి సర్వదర్శనం
- 7 గంటల నుంచి ఆర్జిత పూజలు
- 8.30 ఆర్జిత బ్రహ్మోత్సవం
- 9.30 గంటలకు నిత్యార్జిత కల్యాణం
- మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన
- 3 గంటల నుంచి పభుత్సోత్సవం.
- సాయంత్రం 5.30 గంటల వరకూ సర్వదర్శనం
- 5.30-7.00 మధ్య సాయం కాలార్చన (దర్శన విరామం)
- 7.00-8.30 గంటల వరకూ సర్వదర్శనం.
- 8.30-8.40 వరకూ సేవాకాలం.
- రాత్రి 9.00 గంటలకు ఏకాంతసేవ (పవళింపు సేవ) అనంతరం ఆలయ తలుపులు మూసివేస్తారు.

వసతి వివరాలకు..

- ఆలయం వద్ద వసతి సౌకర్యం కోసం సీఆర్‌వో కార్యాలయం నంబర్లు 90375 69891, 90375 67892లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.



ఎలక్ట్రానిక్ తూకం మోసాలను వివరిస్తున్న గాంధీభగవాన్‌రాజు

రొయ్యల తూకంలో మోసం

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ కాటాపై రొయ్యల తూకంలో రైతులను ఏజెంట్లు మోసగిస్తున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అన్నారు. సంఘ భవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ కాటా ఆప్షన్లు మార్చి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కిలోకి సుమారు 60 గ్రాములు టన్నుకు 50 కిలోలకు పైబడి రొయ్యలను రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఆక్వా సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ కాటాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. తూకాల్లో ఏజెంట్లు చేసే మోసాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఏజెంట్లు కాటాల ఆప్షన్లు మార్చుతున్న తీరు ఆయన వివరించారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బోనం చినబాబు, పెన్మెత్స సత్యనారాయణరాజు, మేడిద జాన్‌రాజు, అంగర వరప్రసాద్, దాట్ల సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ పట్టభద్రులకు విదేశీ ఉద్యోగావకాశాలు

అభ్యర్థులకు జర్మనీ భాషపై ఎస్సీ సంక్షేమ శాఖ శిక్షణ

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, జూలై 25, (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ డిగ్రీ పూర్తిచేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు. అభ్యర్థులకు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ పశ్చిమ, ఏలూరు జిల్లాల డీడీలు వై.విశ్వమోహన్‌రెడ్డి, రామాంజనేయురాజు తెలిపారు. శుక్రవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం కలిగి ఉండాలన్నారు. లేదా జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి మూడేళ్ల క్లినికల్ అనుభవం కలిగి ఉండాలన్నారు. అభ్యర్థినులకు 35 ఏళ్ల వయస్సు మించరాదన్నారు. ఆసక్తి గల అభ్యర్థనులు ఈ నెల 29 తేదీలోపు ఏలూరు అమీనా పేట బాలయోగి సైన్స్ పార్క్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ సాధికారిత కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. తిరుపతి, గుంటూరు లేదా విశాఖపట్నంలో జర్మన్ భాషపై 8 నెలలు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు ఏలూరు జిల్లాలో 9704782803, పశ్చిమగోదావరి జిల్లాల వారు 94922 03165, 83098 67414 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.



అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను పరిశీలిస్తున్న ఏలూరు ఎస్పీ కిశోర్

అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ధ్వంసం

ఏలూరు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను తొలగించి వాటిని ధ్వంసం చేసినట్లు ఎస్పీ కేపీఎస్.కిశోర్ తెలిపారు. ఏలూరులో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తొలగించిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ కిశోర్ సమక్షంలో రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహనాలకు సంబంధింత కంపెనీలు ఇచ్చిన సైలెన్సర్లు కాకుండా ఎక్కువ శబ్దం వచ్చే వాటిని బిగించుకుని శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు తయారు చేసే కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

నంబర్ ప్లేట్‌పై స్టిక్కర్లు ఉంటే వాహనం సీజ్

కొంతమంది నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు అంటిస్తున్నారని అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండాలన్నారు. పిల్లల సౌకర్యం కోసం తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను కొనిస్తున్నారని, వాటి ద్వారా సమస్యలను కూడా కొని తెచ్చుకోవద్దన్నారు. హైస్పీడు వాహనాలను పిల్లలకు ఇవ్వరాదని ఎస్పీ కిశోర్ సూచిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులతో పాటు తల్లి దండ్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ కె అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణబాబు, ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ పలువురు పాల్గొన్నారు.



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శిథిల భవనాలను తొలగిస్తున్న దృశ్యం

భవనాల కొరత తీరేలా..

- తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కొత్త భవనాలు
- శిథిల భవనాల తొలగింపు పనులు
- ఎమ్మెల్యే ఆరిమిల్లి చొరవతో రూ. 20 కోట్లు మంజూరు

తణుకు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో కొత్త భవనాలు నిర్మాణానికి రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. భవనాలు కొరత, ఆసుపత్రిలో ప్రజలకు సౌకర్యాలు కల్పనకు అవసరమైన భవనాలు అందుబాటులో లేవని వైద్యులు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు విన్నవించడంతో ఆయన ఆసుపత్రి ప్రాంగణంలోనే శిథిల భవనాలు స్థానే కొత్త భవనాలు నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణకు కృషి చేశారు. 17వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు చేయించారు.

శిథిల భవనాల తొలగింపు

ఆసుపత్రిలో భవనాల కొరత ఉంది. కానీ వాటిని నిర్మించడానికి అనువైన స్థలం అందు బాటులో లేదు. ఎటు చూసిన సమస్య పరిష్కా రం అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఆసుపత్రిలో మాత్రం కనీసం వైద్యులకు అవసర మున్న గదులు లేక, రోగులకు కల్పించే సౌకర్యాలు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆసుపత్రి ప్రాంగ ణంలోనే ఉన్న సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు నివాస సముదాయాలు శిథిలావస్థకు చేరడంతో చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని బావించారు. దీంతో ప్రస్తుతం శిథిల భవనాలు తొలగింపు కార్యక్రమం చేపట్టడం జరిగింది. కొత్త భవనాలు నిర్మించడ ద్వారా చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుందని బావిస్తున్నారు.

చాలా వరకు సమస్య పరిష్కారం



పాత భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించడం వల్ల చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుంది. ఆసుపత్రిలో భవనాల కొరతను తీర్చాలనే పట్టుదలతో ఎమ్మెల్యే ఉన్నారు. ముందుగా పాత భవనాలు తొలగిస్తున్నాం. ఆ స్థలాన్ని బట్టి కొత్త భవనాలు నిర్మిస్తాం.

సాయి కిరణ్, తణుకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్



మూర్ఛ వ్యాధిపై ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పశ్చిమలోని 23 గ్రామాల్లో

మూర్ఛపై విస్తృత పరిశోధన

ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీరావు

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్, ఎయిమ్స్ ఢిల్లీ, పంజాబ్ దయానంద మెడికల్ కాలేజీ భాగస్వామ్యంతో మూర్ఛ (ఎపిలెప్సీ) వ్యాధిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీరావు తెలిపారు. భీమవరంలో నిర్వహించిన ఆశా వర్కర్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ పరిశోధనను పశ్చిమ గోదావరి జిల్లాలోని 14 పీహెచ్‌సీలకు చెందిన 23 గ్రామాల్లో కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశోధనలో భాగంగా జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహకారంతో మూర్ఛవ్యాధిపై 23 గ్రామాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, మూర్ఛను గుర్తించడం ఎలా, ఈ వ్యాధిగ్రస్తులకు వారి కుటుంబ సభ్యులు సరైన మద్దతు ఎలా ఇవ్వాలో- అలాగే ఈ వ్యాధికి సంబంధించి సామాజిక అపోహలు ఎలా తొలగించాలో వివరంగా చర్చించామన్నారు. మూర్ఛ ఉన్న వ్యక్తుల చదువు, ఉద్యోగం, వివాహం, గర్భధారణ, ప్రసవం, పిల్లల పోషణ, మెనోపాజ్, వాహనాలు నడపటం ఇంకా అనేక దినచర్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దయానంద మెడికల్ కళాశాల యూరాలజీ విభాగం ప్రొఫెసర్ గగన్‌దీప్ సింగ్, హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సీతా జయలక్ష్మి, డాక్టర్ ఉష, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టాలను అందిస్తున్న నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్

సృజనాత్మకతతో వృద్ధి సాధించండి

నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి

ఏలూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇతరుల సహాయం కోసం ఎదురుచూడకుండా తమకు తామే సృజనాత్మకతతో ఉద్యోగ, వ్యాపార అవకాశాలను పట్టభద్రులైన విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆదికవి నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.స్వామి సూచించారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో గత విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో యూనివర్సిటీ పరిధిలో స్వర్ణ, రజిత పతకాలు సాధించిన 8 మంది టాపర్లను అబినందించడంతోపాటు, ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థినులకు శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలను అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, కరస్పాండెంట్, మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాల ప్రారంభోత్సవానికి రానున్న సీఎం?

నన్నయ వర్సిటీలో నిర్మించిన ఇంజనీరింగ్ కళాశాల, పురుషుల వసతి గృహం, ఇతర విభాగాల భవనాల ప్రారంభోత్సవం ఆగస్టులో జరుగనుందని, కార్యక్రమానికి సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రిని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని రిజిస్ట్రార్ వెల్లడించారు. కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి వర్సిటీలో బీటెక్ కోర్సును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లలో ప్రారంభించనున్నామన్నారు. కొద్దినెలల్లోనే ఆటోమేషన్ విధానాన్ని పరీక్షల విభాగంలో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం పాడేరులో వర్సిటీ క్యాంపస్‌ను ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో బీటెక్, బీ-ఫార్మసీ కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి రూ.20 కోట్లు మంజూరయ్యాయన్నారు.

అమలాపురం బస్సుల దారి మళ్లింపు

- చించినాడ వరకు కొన్ని సర్వీసులు
- బ్రిడ్జి మరమ్మతులు పూర్తయ్యే వరకు ఇంతే

భీమవరం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): చించినాడ బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో అమలాపురం సర్వీసులను కొనసాగించేందుకు ఆర్టీసి అధికారులు రూట్ మార్చి పంపుతున్నారు. కొన్ని సర్వీసులను భీమవరం నుంచి అమలాపురం (వయా) పాలకొల్లు, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట మీదుగా భీమవరం బస్ కాంప్లెక్స్ నుంచి ప్రతి గంటా 15 నిమిషాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడిపేలా ఏర్పాటుచేశారు. రాజోలు, తదితర ప్రాంతాలకువెళ్ళే ప్రయాణికుల కోసం భీమవరం బస్ కాంప్లెక్స్ నుంచి చించినాడ బ్రిడ్జి వరకు వయా పాలకొల్లు మీదుగా ప్రతి గంటకు ఒక బస్సును ఏర్పాటు చేశారు. అలాగే అటువైపు దిండి చెక్ పోస్టు నుంచి అమలాపురానికి వయా రాజోలు మీదుగా ప్రతి గంటకు బస్సు సర్వీసు ఏర్పాటుచేశారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి ప్రజా రవాణాధికారి ప్రసాదరావు కోరారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఆర్టీసీ డిపోలో రోజు వారి వేతనంతో ఔట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమవరం అసిస్టెంట్ మేనేజర్ సురేష్ తెలిపారు. ఎటువంటి యాక్సిడెంట్ లేనట్లుగా ఎంవీఐ ఇచ్చే ధ్రువపత్రం, ఆధార్ కార్డు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో డిపో మేనేజర్ కార్యాలయానికి రావాలని, రికార్డుల పరిశీలన అనంతరం మెడికల్ పరీక్షలు, శిక్షణ అనంతరం ఎంపికైన అభ్యర్థులను రోజువారీ వేతనం చెల్లించే విధంగా నియమిస్తామని తెలిపారు. దరఖాస్తులను భీమవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో 30వ తేదీ లోపు ఇవ్వాలని తెలిపారు. ఇతర వివరాలకు 83415 43351 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

27న ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి

కంప్యూటర్ ఆధారిత పరీక్ష

ఏలూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జోన్-2 పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల్లోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్టు)ని ఈ నెల 27న ఉదయం 9.30 నుంచి 11.30 గంటలవరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్టు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (కాకినాడ ఆర్జేడీ) జి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి, కొంతమూరు ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి కాకినాడ అచ్యుతాపురం, రాజమండ్రి లూథర్‌గిరిలలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించినట్టు వివరించారు. ఈ కేంద్రాల పరీక్షార్థులు ఏవైనా సందేహాలుంటే 98485-74622, 83091-77952 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ ఎస్వీకేపీ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల, దంతులూరి నారాయణరాజు అటానమస్ కళాశాల, ఎస్.ఆర్.కే.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో సీబీటీ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులకు సందేహాలుంటే 99892-71919 నంబరులో సంప్రదించాలని కోరారు. హాల్ టిక్కెట్లను సీఎస్ఈ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోరని స్పష్టం చేశారు. హాల్ టిక్కెట్‌తోపాటు, ఏదైనా ఫొటో గుర్తింపు కార్డుతో సహా పరీక్ష కేంద్రానికి గంటన్నర ముందుగా హాజరుకావాలని కోరారు.

క్రైం సమాచారం

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని యువకుడి మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే హెచ్‌సీ ఎంఎస్ఎన్ ప్రసాద్ తన సిబ్బందితో శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 35 ఏల్ల వయస్సు కల్గి 5.5 అడుగుల ఎత్తు, చామన చాయశరీరంతో సామాన్య దేహధారుడ్యంతో ఉన్నాడు. మృతుడు తెలుపు, నలుపు సిమెంటు రంగులతో కూడిన అడ్డ చారల పొట్టిచేతుల చొక్కా, టీ షర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని కుడిచేయి మణికట్టుపైన త్రిశూలం గుర్తు కల్గిన పచ్చబొట్టు ఉంది. రైలు నుంచి జారి పడ్డాడా, రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు 99891 09912 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

అప్పుల బాధతో అర్చకుడి ఆత్మహత్య

ఉంగుటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాచూరు పల్లాలమ్మ ఆలయ అర్చకుడిగా పనిచేస్తున్న రుద్రపాక లీలా శివకుమార్(53) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. రాచూరు పల్లాలమ్మ ఆలయ అర్చకుడిగా పనిచేస్తున్న శివ కుమార్ ఇటీవల కాలంలో సుమారు రూ.20 లక్షలు అప్పు చేసి అవి తీర్చలేక ఆవేదన చెందుతున్నట్లు కుటుంబ సభ్యుల వద్ద తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉంగుటూరు సోషల్ ఫారెస్ట్ సమీపంలో పురుగులమందు తాగి పడిఉన్నట్టు స్థానికులు గమనించి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య కళ్యాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె దుర్గాసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

యువతిని మోసగించిన కేసులో యువకుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం,జూలై 25(ఆంధ్రజ్యోతి): ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన ఘటనపై నేరం రుజువు కావడంతో ఆ యువకుడికి ఏడాది జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. జంగారెడ్డిగూడెంలోని ఒక వస్త్రాల దుకాణంలో పనిచేస్తున్న యువతికి జంగారెడ్డిగూడెంకు చెందిన సారంపాటి రాజేష్ ఆ యువతితో పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసగించి, పెళ్ళికి నిరాకరించాడు. ఆ బాధితురాలు 2021లో జంగారెడ్డిగూడెం పోలీసు లకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేశారు. అప్పటి చింతలపూడి సీఐ ఇన్‌ఛార్జి, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీవీఎస్ మల్లేశ్వరరావు రాజేష్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణలో నిందితుడైన రాజేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా సొమ్మును బాధితురాలికి ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ మహిళను కొవ్వూరు పట్టణ పోలీసులు రక్షించారు. వివరాలివి.. కొయ్యలగూడెం మండలానికి చెందిన ఓ మహిళ కుటుంబ సమస్యలతో గొడవ జరిగి శుక్రవారం కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదాట్లోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి నడిచి వెళ్తోంది. కాగా, అదే సమయంలో ఆటోలో అటుగా వెళ్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి గమనించి 112 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్పీ డీ.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.విశ్వం, హెచ్‌సీ ఎంవీవీ సత్యానారాయణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళను గుర్తించి పోలీస్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, పట్టణ పోలీసులను ఎస్పీ అభినందనలు తెలిపారు.



రోడ్డు పక్కకు వెళ్లిన బస్సు

వ్యాన్ నుంచి చెల్లాచెదురైన ఉల్లి, అల్లం, బంగాళదుంపలు

మినీ వ్యాన్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఏలూరు క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి):వర్షం కారణంగా ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న ఒక మినీ వ్యాన్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో బస్సు డ్రైవర్‌కు, మినీ వ్యాన్‌లో ఉన్న ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు అదుపుతప్పి రోడ్డు దిగువ భాగానికి వెళ్లిపోయింది. కాకినాడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు కాకినాడ నుంచి విజయవాడకు శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరింది. తాడేపల్లిగూడెం నుంచి ఉల్లిపాయలు, అల్లం, ఇతర సరుకుల లోడుతో మినీ వ్యానును బయలుదేరి ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం గ్రామానికి వెళ్తుంది. మార్గమధ్యలో 16వ నంబరు హైవే ఏలూరు జిల్లా ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి వద్ద వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొని అదుపుతప్పి రోడ్డు దిగువ భాగానికి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ కాకినాడకు చెందిన వరిపిల్లి రవి, వ్యానులో ఉన్న సరుకు యజమాని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడానికి చెందిన కోరా శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిద్దరిని హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ రాంబాబు హైవే పెట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేశారు. ఈఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుల దొంగ అరెస్ట్.. రూ. 3 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల్లోని డిక్కీలో డబ్బులు దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 4వ తేదీన భీమవరం పట్టణ పరిధిలో కళాభవనం వారి వీధికి చెందిన ఎం.రమేష్ బాబు తన వ్యాపారం నిమిత్తం మోటార్ సైకిల్ డిక్కీలో రూ.3లక్షలు పెట్టాడు. బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి డిక్కీలో ఉన్న రూ.3 లక్షల నగదు కనిపించలేదు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.నాగరాజు, ఎస్ఐలు కిరణ్‌కుమార్, వీర్రాజు వారి సిబ్బందిని టీమ్‌లుగా ఏర్పాటు చేసి సెల్ లోకేషన్ ద్వారా ఇద్దరిని గుర్తించారు. ఈనెల 9వ తేదీన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం, సుందరయ్యపేట గ్రామానికి చెందిన మేకల బాలరాజును అరెస్ట్ చేశారు. మరో ముద్దాయి అయిన ఒడిశా రాష్ట్రానికి చెందిన దాసు రబీ (రవి)ని ఈనెల 25వ తేదీన అరెస్ట్ చేసి అతడి వద్ద రూ. 3 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కేసును దర్యాప్తు చేసిన కె.నాగరాజును, ఎస్ఐలు కిరణ్‌కుమార్, వీర్రాజు, క్రైం సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



అగ్ని ప్రమాదం తరువాత కార్యాలయం.. దగ్ధమైన ల్యాప్‌టాప్

మునిసిపల్ కమిషనర్ చాంబర్‌లో అగ్నిప్రమాదం

- దగ్ధమైన కంప్యూటర్, ఏసీ, ఫ్యాన్‌లు, లైట్లు
- విలువైన డాక్యుమెంట్స్‌కు నష్టం లేదు : కమిషనర్

జంగారెడ్డిగూడెం,జూలై25(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం మునిసిపల్ కమిషనర్ చాంబర్ రూమ్‌లో గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదం జరిగింది. గదిలో ఉన్న కంప్యూటర్, ఏసీ, సీసీ కెమేరాల మోనిటర్, మూడు ఫ్యాన్‌లు, మూడు ట్యూబ్ లైట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ల్యాప్‌లాప్, ఆఫీస్ టేబుల్, కుర్చీ పాక్షికంగా దగ్ధమయ్యాయి. గదిలో మంటలు బాగా వ్యాపించడంతో గోడలన్నీ నల్లగా మారిపోయాయి. ఈ సందర్భంగా కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి సమయంలో తన చాంబర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిందని వాచ్‌మన్ ఫోన్ చేయగా వెంటనే వెళ్లి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేసినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు మూడు లక్షలు ఆస్తి నష్టం జరిగిందని, ఎటువంటి విలువైన పత్రాలు చాంబర్‌లో లేవని, విలువైన డాక్యుమెంట్స్‌కు నష్టం జరగలేదన్నారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారన్నారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలో చిన్నారి అదృశ్యం

రెండు గంటల్లో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

పెంటపాడు, జూలై25(ఆంధ్రజ్యోతి):పోలీస్‌స్టేషన్ వద్ద అదృశ్యమైన చిన్నారిని పోలీసులు రెండు గంటల వ్యవధిలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన పెంటపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. రాచర్ల గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి కొడవల్లూరి దుష్యంత్‌సూర్య తల్లిదండ్రులు ఓ పని నిమిత్తం కారులో చిన్నారని పెట్టి పెంటపాడు పోలీస్‌స్టేషన్ వచ్చారు. కారు అద్దం తెరిచి ఉండడంతో చిన్నారి బయటకు వచ్చి తిరగడాన్ని గమనించిన కె.పెంటపాడు వాసి ఊరిలో చెప్పి బాలుడి తల్లిదండ్రులకు అప్పగించాలన్న ఉద్దేశంతో ఇంటికి తీసుకెళ్లాడు. పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు కారులో చిన్నారి లేకపోవడాన్ని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ స్వామి సిబ్బందితో టీంలుగా విడిపోయి గాలించేసరికి కె.పెంటపాడులో బాలుడు కనిపించడంతో తల్లిదండ్రులకు అప్పగించారు.

నగదు దొంగతనం కేసులో ఒకరికి ఏడు నెలల జైలు

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన ద్విచక్ర వాహనం డిక్కీలోని నగదు, సెల్‌ఫోను దొంగిలించిన కేసులో ఓ వ్యక్తికి కోర్టు ఏడు నెలల జైలు శిక్ష విధించింది. రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన ఉప్పల రాము ఈ ఏడాది జనవరి ఒకటిన భార్యతో సహా గుడికి వెళ్లారు. బైక్ పార్క్ చేసి లోపలికి వెళ్లి వచ్చేసరికి డిక్కీలో ఉన్న రూ.15వేల నగదు, సెల్‌ఫోన్ కనిపించలేదు. ఈమేరకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు భీమవరం మండలం నరసింహపురం గ్రామానికి చెందిన మధురా వెంకన్న అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసును శుక్రవారం విచారణ చేసిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు వెంకన్నపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ వీర్రాజు తెలిపారు. అలాగే కొవ్వాడ అన్నవరానికి చెందిన యర్రంశెట్టి విజయరామారావు చెరువుపై ఈ ఏడాది మార్చిలో మూడు మోటార్లు చోరీకి గురైన ఘటనలో భీమవరం మండలం అనాకోడేరుకు చెందిన నేపాల సూర్యారావు అనే వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



ఏలూరు రూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ పాటిస్తూ నాణ్యమైన భోజనం అందించాలని గుడివాకలంక సర్పంచ్ ఘంటశాల నాగరాజు కోరారు. శుక్రవారం గుడివాకలంక ప్రైమరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం నంబూరి రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

చింతలపూడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అర్పణ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మానసిక ఒత్తిడి అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చింతలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యను క్రమశిక్షణగా చదువుకోవాలని, సైబర్ నేరాలను తెలుసుకోవాలని, వాటిని ఏ విధంగా అధికారులకు తెలపాలో వివరించారు. సోషల్ మీడియాలో జాగ్రత్తలు పాటించాలని, ఫేక్ ఆఫర్లు వంటివి గమనించాలని సూచించారు.



బాపిరాజుగూడెంలో బాధితులకు చెక్కులు అందిస్తున్న చింతమనేని

9 మందికి సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

దెందులూరు,జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 9 మంది బాధితులకు 5లక్షల50 వేల రూపాయల చెక్కులను అందించామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలో బాపిరాజుగూడెం, రామచంద్రపురం గ్రామాల్లో విజయరాయి సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు బొప్పన సుధా, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు తలకొండ జమలయ్యతలో కలిసి గాలింకి నిర్మల, కొనకళ్ల వేణుబాబు, నరదల అమ్ములు, చలమాల నాగమణి, బొప్పన వెంకటేశ్వరావు, పామర్తి వెంకట రామకృష్ణ, బొప్పన రాము, బొల్లిన లక్ష్మీవనజ, బొప్పన సుబ్బారావులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొప్పన మార్కెండేయ, పార్టీ కార్యదర్శి గుండ్రు సుబ్బారావు తదితరులు ఉన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు, కూటమి నాయకులు

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

జీలుగుమిల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మమత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులతో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. గిరిజన ప్రాంతంలో జంగారెడ్డిగూడెం మమత ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరంద్వారా సేవలు అందిస్తున్న సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం హోప్స్ మినిస్ట్రీస్ ఛైర్ పర్సన్ గెడ్డం శామ్యూల్ జాషువా రాయితీపై ఇచ్చే కుట్టు మిషన్‌లు ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. నాయకులు గడ్డమణుగు రవికుమార్, చాట్రాతి ప్రసాద్, పసుపులేటి రాము, గుడ్ల రాంబాబు, నాలి శ్రీను, అంబేడ్కర్ యూత్ అధ్యక్షులు ధారా మనోజ్, తలారి సతీష్, బొంతు వెంకటేశ్వరావు, చేబత్తిన అరుణ్, బొంతు రామకృష్ణ ఉన్నారు.



సుభాశ్‌బాబును సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా సుభాశ్‌బాబు

ఏలూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు హేలాపురి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలపైగా లయనిజంలో సేవలు అందిస్తున్న హేలాపురి క్లబ్ సభ్యుడు పర్వతనేని సుభాశ్‌బాబు అమెరికాలో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి ఏలూరు వచ్చిన సందర్భంగా శుక్రవారం సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సుభాశ్‌బాబు నేతృత్వంలో రెండు తెలుగు రాష్ట్రాలలో మరెన్నో సేవలు అందించాలని ఆకాంక్షించారు. గాట్ ఏరియా లీడర్ ఎం.ఉపేంద్ర, పూర్వపు జిల్లా గవర్నర్లు వి.మురళీమోహన్‌రావు, డాక్టర్ పి.విజయభాస్కరరెడ్డి, కేవీ కిషోర్‌కుమార్, లయన్స్ క్లబ్ నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, వి.సత్యస్వరూప్, రీజియన్ ఛైర్మన్ వి.శ్రీనివాస్, గోపాల్, జోన్ ఛైర్మన్ కేబీ రావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీసు వద్ద నినాదాలు చేస్తున్న కేంద్ర శాఖల రిటైర్డ్ ఉద్యోగులు

'పెన్షన్ రీవాలిడేషన్ యాక్టును రద్దు చేయాలి'

ఏలూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉద్యోగులకు ప్రస్తుతమున్న పెన్షన్ల విధానాన్ని సవరించేందుకు ఉద్దేశించిన పెన్షన్ రీవాలిడేషన్ యాక్టు-2025ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వ శాఖల రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద టెలికాం, తపాలా, బీఎస్ఎన్ఎల్, సెంట్రల్ ఎక్సైజ్, తదితర శాఖల రిటైర్డ్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి జీ.ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్ల మధ్య ఎటువంటి వ్యత్యాసాలను సహించబోమని, ఆ మేరకు ఒకే పనికి ఒకే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా మానవహారం ప్రదర్శనతో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంఘ నాయకులు ప్రభాకరరావు, ప్రసాద్, వెంకట్రావు, నరసింహారావు, ఆలిండియా బీఎస్ఎన్ఎల్, పీడబ్ల్యూయే, ఎస్ఎన్‌పీడబ్ల్యూఏ, తదితర శాఖల రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'దోమ రహిత సమాజాన్ని నిర్మిద్దాం'

ఉంగుటూరు, జూలై25(ఆంధ్రజ్యోతి):'లార్వా జనిత ప్రదేశాలను నిలువరిద్దాం-దోమ రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో శుక్రవారం కైకరం గ్రామంలో పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వై.వీ.లక్ష్మణరావు డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు నిల్వ నీటి విషయంలో అప్రమత్తంగా ఉండి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి పరిశీలన సదస్సులు నిర్వహించారు. ఎం.ఎల్.హెచ్. పి.జయశ్రీ ఆరోగ్య కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, శైలజ, విజయలక్ష్మి, జయలక్ష్మి, రాధ, కనకదుర్గ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు పరిధిలోకి..

హైస్కూల్ ప్లస్‌లు !

(5వ పేజీ తరువాయి)

50 శాతం మార్కులున్న వారిని ప్రభుత్వ నిబంధనల మేరకు హైస్కూల్ ప్లస్‌లలో పీజీటీలుగా నియమించి, వారికిచ్చే జీత భత్యాలకు అదనంగా నెలకు రూ.2వేలు ఇన్సెంటివ్ గా చెల్లిస్తున్నారు. ఆ మేరకు రెండేళ్లుగా హైస్కూల్ ప్లస్‌లలో కొన్ని సదుపాయాలు, బోధనా సిబ్బందిని నియమించినా, వీటిలో అడ్మిషన్లు తీసుకునే బాల బాలికలు అతి స్వల్పసంఖ్యలో ఉండడం గమనార్హం. జిల్లాలో 33 హైస్కూల్ ప్లస్‌లుండగా, వీటిలో 26 మాత్రమే ప్రస్తుతం కొనసాగుతున్నాయి. మిగతా వాటిలో ఒక్క విద్యార్థీ లేకపోవడంతో రికార్డులకే పరిమితమయ్యాయి. ఇక ఈ ఏడాది 26 హైస్కూల్ ప్లస్‌లలో విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే 862 మంది మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల తీరును గమనిస్తే ఆరు చోట్ల ఒక్కరూ చేరకపోగా, మిగతా వాటిలో కేవలం 427 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్‌లో 435 మంది విద్యార్థులు చదువుతున్నారు.

వైభవంగా 'శ్రావణ' పూజలు





అలంకరణలో చేబ్రోలు సాయిగాయత్రి.. ఏలూరులో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చక బృందం

ఏలూరుకార్పొరేషన్/కామవరపుకోట/ఉంగుటూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని పలు డివిజన్లలో గల అమ్మవారి ఆలయాల వద్ద శుక్రవారం శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా భక్తులు విశేష పూజలు ప్రారంభించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో పూజా కార్యక్రమాలతో కిటకిటలాడాయి. సత్రంపాడు శ్రీసౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం సందర్భంగా అమ్మవారికి ఆదిలక్ష్మీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఛైర్మన్ కేజీఎస్.వి.గోపాలకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిన్నబాబు, శ్రీనివాసరావు, పోతురాజు, ప్రవీణ్, నాగభూషణం, సావిత్రమ్మల బృందం అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేసి సేవలందించారు. కోటదిబ్బ వద్ద గల గణపతి త్రిదేవి పీఠంలో అర్చక బృందం లక్ష కుంకుమార్చన పూజలు జరిపి 125 మంది సువాసినీలతో స్వామికి పూజలు నిర్వహించారు. సత్రంపాడులోని అంబికాదేవి ఆలయంలో, పత్తేబాదలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శ్రావణ పూజలు ప్రారంభించారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ ఆలయంలో అమ్మవారికి జ్ఞాన ప్రసూనాంబగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. దక్షిణపువీధిలోని మహిషాసుర మర్ధిని, బాల త్రిపుర సుందరీదేవి, అగ్రహారం లోని జ్ఞాన సరస్వతీదేవి, రాజ్యలక్ష్మీదేవి, పవరు పేట లోని కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవార్ల ఆలయాల వద్ద మహిళలు శ్రావణ పూజలు చేశారు.

● కామవరపుకోట లక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో శుక్రవారం పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో, మహిళలతో సామూహికంగా కుంకుమ పూజలు జరిపించి వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఉంగుటూరు మండలంలో ఉంగుటూరు చల్లాలమ్మ, భద్రకాళి, చేబ్రోలు సాయిగాయత్రి ఆలయాల్లో అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేసి నైవేద్యాలు సమర్పించారు.



జంగారెడ్డిగూడెంలో ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

'విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి'

జంగారెడ్డిగూడెం/పోలవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఐద్వా జిల్లా నాయకులు ఎం.నాగమణి, ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యుత్సాహం చూపిస్తున్నారన్నారు. ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీలతో ప్రజలను బాదుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మడకం కుమారి, పి.హైమావతి, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, ఎం.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

● స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను రద్దు చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వం కూలడం ఖాయమని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం పోలవరంలో ఆల్ ఇండియా కిసాన్ మజ్దూర్ సంఘం జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కుంజం రామారావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కారం భాస్కర్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు పోశీరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురసం లత, అరుణోదయ జిల్లా నాయకులు నడపల ముక్కారెడ్డి, ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ కార్యదర్శి గురుగుంట్ల ప్రసాద్ రెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సముద్రాల సాయికృష్ణ, గెడ్డపల్లి సర్పంచ్ సూంట్రు శారద, ముసలారెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

పోలవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): పోలవరం పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు శుక్రవారం పంచాయతీ సర్పంచ్ పొడుం పుష్ప ఉచితంగా రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శానిటరీ మేస్త్రి ఫణి మాట్లాడుతూ వర్షాల సీజనులో పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పారిశుధ్య కార్మికులకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్న పంచాయతీ పాలక వర్గానికి సర్పంచ్‌కి కార్మికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పారిశుధ్య కార్మికులు వారా నాని, వారా పోశియ్య, రవి, బంగారు వెంకటేశ్వరరావు, మాడుగుల పెద్దింట్లు, మాడుగుల సాయి తదితరులు పాల్గొన్నారు.

'పది' స్టడీ మెటీరియల్ రూపకల్పనకు వర్కుషాపు

ఏలూరు అర్బన్, జూలై25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న బాల బాలికలకు ఉపయోగపడేందుకు ఉద్దేశించిన స్టడీ మెటీరియల్‌ను రూపొందించే క్రమంలో టెన్త్ బోధించే అన్ని సబ్జెక్టుల నిపుణులతో వర్క్‌షాపును శుక్రవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో నిర్వహించారు. ఉప విద్యాశాఖాధికారి రవీంద్రభారతి మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు అవకాశమున్న ముఖ్యమైన ప్రశ్నలు, బిట్స్‌పై సబ్జెక్టు నిపుణుల అంచనాలు, సూచనల మేరకు విజయకేతనం పేరిట స్టడీ మెటీరియల్‌ను జడ్పీ నిధులతో డీసీఈబీ ఆధ్వర్యంలో ముద్రించి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి సర్వేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ముద్రించిన స్టడీ మెటీరియల్ కంటే భిన్నంగా మరింత మెరుగైన విధంగా తీర్చిదిద్దేందుకు 40మంది సబ్జెక్టు నిపుణులతో ప్రభుత్వ ఆదేశాలమేరకు వర్కుషాపును నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా సీ, డీ గ్రేడుల విద్యార్థులు మెరుగైన ఫలితాలు, మార్కులు సాధించేందుకు ఉపయోగపడేలా స్టడీ మెటీరియల్ రూపొందిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ జయలక్ష్మి, స్కూలు హెచ్ఎం కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలి

జీలుగుమిల్లి, జూలై25:(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కార న్యాయస్థానాన్ని వినియోగించుకోవాలని సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీలుగుమిల్లి ఏడీ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించారు. పలువురు విద్యుత్తు వినియోగదారులకు పరిష్కారం కాని సమస్యల్ని ఈ వేదిక ద్వారా పరిష్కరించారు. స్థానిక విద్యుత్ సిబ్బంది సమస్యలు పరిష్కరించనిచో ఫోన్ వాట్సాప్, ఈ-మెయిల్ లేదా టోల్ ఫ్రీ నెం.1912కు సమచారం ఇవ్వడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జీలుగుమిల్లిలో 8 ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణమే వీటిని పరిష్కరిస్తామన్నారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎస్.సబ్బారావు, ఎస్.రాజబాబు, ఎస్.మురళీకృష్ణ, ఏడీఈ కె.రమేష్‌బాబు, ఏఈ కె.నాగేశేషు, విద్యుత్‌శాఖ సిబ్బంది ఉన్నారు.

రెడీమేడ్ షాపులో చోరీ

ఏలూరు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రెడీమేడ్ షాపు తాళాలు పగులగొట్టి ఆ షాపులోని వస్త్రాలను అపహరించిన ఘటన ఏలూరులో జరిగింది. ఏలూరు పవర్‌పేటకు చెందిన గొట్టుపల్లి మాధవస్వామి ఏలూరు ఆర్ఆర్‌పేటలోని రైల్వే గేటు సమీపంలో వినాయక ఫ్యాషన్స్ రెడీమేడ్ షాపును నిర్వహిస్తున్నారు. యథావిధిగా ఈనెల 24న రాత్రి షాపు మూసివేసి తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం షాపునకు వెళ్లేసరికి షట్టర్ పగులగొట్టి ఉంది. షాపులో రూ.80 వేల విలువైన రెడీమేడ్ డ్రస్సులు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు క్లూస్ టీమ్ బృందాలు ఘటనా స్థలాన్ని పరిశీలించాయి.





లింగపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్.. పూళ్లలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ధర్మరాజు

సంక్షేమ పథకాలు అందుతున్నాయా ?

చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్

లింగపాలెం,జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా ఏమైనా సమస్యలు ఉన్నాయా ? అని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కలరాయన గూడెంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. నందిగం సీతారామతిలక్‌తో కలిసి ఆయన గ్రామంలో పర్యటించి, సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గరిమళ్ల చలపతిరావు, నందిగం సీతారామతిలక్, నందిగం శ్రీధర్, మునునూరి గంగాధరరావు, కొల్లి ప్రసాద్, తాడేపల్లి దాసుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● భీమడోలు : అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం, గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. 'పల్లెపల్లెకు పత్సమట్ల' కార్యక్రమంలో భాగంగా భీమడోలు మండలంలోని భీమడోలు, అంబర్‌పేట, కురెళ్ళగూడెం, కోడూరుపాడు, దుద్దేపూడి, పూళ్ళ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో గ్రామస్థుల సమస్యలను విన్నారు. సంబంధిత అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి నేతలు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కొండలరావుపాలెంలో మొక్కలను రైతులకు అందిస్తున్న కోకో కంపెనీ ప్రతినిధులు

రైతులకు ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ

దెందులూరు,జూలై 25 (ఆంధ్రజ్యోతి):రైతుల అభివృద్ధి కోసం ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నామని కోకో గింజలు కొనుగోలు చేసే మొండలీజ్ కంపెనీ ప్రతినిధులు రాజేష్, రామచంద్రన్, రవీంద్ర అన్నారు. శుక్రవారం కొండలరావుపాలెంలో ఆగ్రో సంస్థ ద్వారా ఆగ్రో ఫారెస్ట్రీ అనే కార్యక్రమం ద్వారా కోకో కంపెనీ ప్రతినిధులు వ్యవసాయ క్షేత్రాల్లో రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. రైతు సంఘం నాయకులు పాలడుగు నరసింహారావు, కంపెనీ ప్రతినిధులు సీహెచ్ బాబు, విజయ్‌ప్రసాద్, హేమంత్, రైతులు శివ, తదితరులు పాల్గొన్నారు



సెల్‌ఫోన్లు అందజేస్తున్న శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్, శిక్షణ ఫౌండేషన్ సభ్యులు

డిజిటల్ సేవలు వినియోగించుకోవాలి

ఏలూరుటూటౌన్, జూలై25(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌లు, స్మార్ట్ టీవీలు, ఇంటర్నెట్ ద్వారా డిజిటల్ సేవలు వినియో గించుకుని విద్యార్థులు విద్యావంతులు కావాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు అన్నారు. శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్, శిక్షణ ఫౌండేషన్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రంథాలయాలకు కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థులు డిజిటల్ లైబ్రేరి ద్వారా ఎంతో విజ్ఞానం పొందడానికి వీలుంటుందని చారిటబుల్ ట్రస్ట్ ఫోన్లు, టీవీలు అందజేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్టర్ ట్రైనర్ జి.సత్యనారాయణ, సిబ్బంది బుజ్జిబాబు, ఐ.రాజారావు, కార్తీక్, నారాయణ రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు చికెన్ వ్యర్థాల

వాహనాలు స్వాధీనం

పెదపాడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): చేపల చెరువులో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, అందేఖాన్‌చెరువు ప్రాంతాల వద్ద ఒక బొలేరో, ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పెదపాడు ఎస్ఐ కట్టా శారదా సతీష్ తెలిపారు. వాహనాలను, వాహనాల్లోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని, చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్టు చెప్పారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

రూ.7,200 నగదు స్వాధీనం

లింగపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామశివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ధర్మాజీగూడెం ఎస్ఐ కె. వెంకన్న తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు సమాచారమందడంతో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఏడువేల రెండు వందలు రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆగస్టు 4న 'మట్టి మనిషి నాటకం'

ఏలూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వైఎంహెచ్‌ఏ హాల్లో ఆగస్టు 4న మట్టి మనిషి నాటకం ఏర్పాటు చేశామని వైఎంహెచ్‌ఏ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50 మంది నటీనటులు, సాంకేతిక నిపుణుల బృందంచే మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్, ఏపీ అభ్యుదయ రచయితల సంఘం - కళాతోరణం, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి నవలాధారంగా మట్టి మనిషి నాటకం రూపొందించారు. నాటక రచన వల్లూరు శివప్రసాద్, యస్.యం బాషా దర్శకత్వం పర్యవేక్షణలో సుమారు మూడు గంటల పాటు నాటకం ప్రదర్శించబడుతుందన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధానికి కృషి చేయాలి

ఏలూరు రూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిరోధానికి సమాజంలో ప్రతీ ఒక్కరు కృషి చేయాలని చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా క్రాఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు నగరంలోని పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృష్ణప్రసాద్, సత్యవతి, దుర్గేష్, సీఎస్‌డబ్ల్యూ జి.రాజలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ

ఏలూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ట్రేస్ ఇండియా, టుగెదర్ ఇండియా స్వచ్ఛంద సేవాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 200 మందికి ఉచితంగా నోట్ పుస్తకాలను నిర్వాహకులు అందజేశారు. సంస్థల ఛైర్‌పర్సన్ దిడ్ల యాంజిలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న పేదకుటుంబాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేయాలనే లక్ష్యంలో భాగంగా ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో చేయూత నిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్ మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్‌ముస్తఫాఅలీ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా భద్రతపై అవగాహన

టి.నరసాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల భద్రత, శక్తియాప్ వినియోగం, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, రోడ్డుభద్రత అంశాలపై ఎస్ఐ ఎం.జయబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొందేందుకు శక్తియాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు తమ ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృష్ణ, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరి ప్రదర్శన రోడ్డు ప్రారంభోత్సవం

జంగారెడ్డిగూడెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గోకుల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద దాత గోకరాజు గంగరాజు సహకారంతో నిర్మించిన గిరి ప్రదర్శన రోడ్డును ఎమ్మెల్యే రోషన్ కుమార్ శనివారం ఉదయం ప్రారంభించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీ అహోబిల చినజీయర్ స్వామి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, దాత గోకరాజు గంగరాజు హాజరుకానున్నట్లు ఆలయ ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు.

కలిదిండిలో బంగారు కుటుంబాల ఎంపిక

కలిదిండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పి-4 పథకం కింద 2,885 బంగారు కుటుంబాలను ఎంపిక చేశామని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర శుక్రవారం తెలిపారు. బంగారు కుటుంబాలను దత్తత చేసుకునే దాతలు సచివాలయాల్లో తమ పేర్లు, ఫోన్ నెంబరు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలకు సాయం చేసే మార్గదర్శకులు ఆర్థిక సాయమే కాకుండా ఏ విధమైన సాయం చేయటానికైనా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు

ముదినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరవాడ గ్రామం వద్ద క్యాంప్ బెల్ కెనాల్‌లో స్నానానికి దిగి గురువారం కొట్టుకుపోయిన గ్రామానికి చెందిన మరీదు వెంకటేశ్వరరావు ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఎస్ఐ వీఎస్.వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసు, అగ్నిమాపక దళ సిబ్బంది గురువారం సాయంత్రం నుంచి కాల్వలో గాలించినా వృద్ధుడి ఆచూకీ లభించలేదు.

50 మంది విద్యార్థుల రక్తదానం



కైకలూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ఇతరులకు ప్రాణదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీలత అన్నారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం, యూత్ రెడ్‌క్రాస్ అసోసియేషన్, రెడ్‌రిబ్బన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి 6 నెలల కొకసారి రక్తదానం చేయవచ్చని దానివల్ల నష్టం ఉండదని విద్యార్థులకు సూచించారు. రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ ఎం. హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకుడు కె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ముదినేపల్లిలో...

ముదినేపల్లి: ముదినేపల్లిలో ఈ నెల 27న రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఏపీ టూరిజం డెలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ పుట్టిన రోజు సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ - కొడాలి వినోద్ ఫాలోవర్స్ ఈ శిబిరాన్ని సంయుక్తంగా నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తోపాటు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు



గోతులు పూడ్చుతున్న దృశ్యం

కలిదిండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జోరువానలో రైతులు మూల్లంక - పెదలంక రహదారి మరమ్మతులను స్వచ్ఛందంగా చేపట్టారు. గుంతల్లో కంకర వేసి పూడ్చుతున్నారు. రెండు రోజులుగా రహదారిపై గుంతల్లో చేరిన నీటిని తొలగించి చదును చేస్తున్నారు. శుక్రవారం టిప్పర్లతో కంకర తీసుకొచ్చి గుంతలను పూడ్చుతున్నారు. బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగకుండా రహదారిని మరమ్మతులు చేయటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఏబీడీఎం డాక్టర్ పాల్ సతీష్

నూజివీడు టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ పూర్తి వివరాలను ఆన్‌లైన్ చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా చర్యలు చేపట్టాలని డీసీహెచ్ఎస్, ఏబీడీఎం డాక్టర్ పాల్ సతీష్ సూచించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణంలో ఉన్న నూతన ఏరియా ఆసుపత్రి భవన సముదాయాన్ని పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో అసంపూర్తిగా ఉన్న స్పెషల్ రూమ్స్‌ని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజారాణి, ఇతర వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించండి



మాట్లాడుతున్న బాబు విల్సన్

నూజివీడు టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందేలా డీలర్లు చర్యలు చేపట్టాలని జిల్లా పౌర సరఫరాల అధికారి బాబు విల్సన్ అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో నూజివీడు నియోజకవర్గం పరిధిలోని రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రతి నెలా రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని, ప్రతినెలా రేషన్ దుకాణాలను తనిఖీ జరుగుతుందని, తేడాలుంటే డీలర్ల తొలగింపులో వెనకాడమని హెచ్చరించారు. సివిల్ సప్లైస్ డీటీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి : ఎంఈవో



ముసునూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాలికలకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖాధికారి బీవీయస్ సుబ్బారావు అన్నారు. శుక్రవారం ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, విద్యామిత్ర క్విట్‌లు పంపిణీ, మంచినీటి ట్యాంక్‌లు, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, బాలికలతో కలిసి భోజనం చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి, పీఈటీ నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో డెక్క తొలగింపు



కైకలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శివారు గ్రామాలకు సైతం నీరందించేందుకు ఎక్కడికక్కడ పంట కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం కైకలూరు మండలం వదర్లపాడు, సీతనపల్లి పంటకాలువల్లో చెత్త తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీతనపల్లి నీటి సంఘం అధ్యక్షుడు కట్టా రమేష్ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలసిన వెలమ సంఘం



కలిదిండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలమ సంక్షేమ సంఘ నాయకులు శుక్రవారం విజయవాడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సంఘ మండల అధ్యక్షుడు అక్కల వెంకటాచలం, ప్రధాన కార్యదర్శి పోకల ప్రసాద్, నాయకులు కోకా శ్రీనివాసరావు, అంకాల దుర్గా ప్రసాద్, పోకల సమత్ కుమార్, కోకా మధునాగు, ముద్దం రంగారావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

శిథిల భవనంలోనే చదువులు!



అప్పారావుపేటలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం

భవనం వినియోగించవద్దని రెండేళ్ల క్రితమే ఇంజనీరింగ్ అధికారులు సూచించినా..

ముదినేపల్లి, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు శివారు అప్పారావుపేట గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల భవనం స్లాబు పాడైపోవటంతో భవనంలోకి వర్షపు నీరు చేరుతోంది. స్లాబు పెచ్చులూడిపడిపోవటం ప్రారంభం కాగా, గోడలు కూడా నెర్రలిస్తున్నాయి. అయినప్పటికీ విద్యార్థులకు గత మూడేళ్లగా ఆ గదుల్లోనే బోధన నిర్వహిస్తున్నారు. భవనంలో వర్షపు నీరు పడని కొద్దిపాటి ప్రదేశంలో విద్యార్థులందరినీ కూర్చోబెట్టి తరగతులను నిర్వహిస్తున్నారు. స్లాబు పెచ్చులూడి పడతాయేమోనని విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. వాస్తవానికి రెండేళ్ల క్రితమే ఆ పాఠశాల భవనం వినియోగానికి పనికి రాదని, మూసేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు మండల పరిషత్ అధికారులకు నివేదిక ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠశాల నిర్వహణకు ప్రత్యామ్నాయ భవనం ఏర్పాటు చేయలేదు. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా రూపొందించలేదు. దీంతో శిథిలమవుతున్న ఆ భవనంలోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కూర్చుంటున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ భవనంలో ఈ పాఠశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నప్పటికీ మండల పరిషత్ అధికారులు గానీ, విద్యాశాఖ అధికారులు గానీ ఆ దిశగా ప్రయత్నాలేమీ చేయటం లేదు.

వివరణ: దీనిపై హెచ్ఎం కల్యాణిని వివరణ కోరగా భవనం పాడైన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



స్లాబు నుంచి కురిసిన వర్షం నీరు

ప్రమాణ స్వీకారం ఎప్పుడో?

» నూజివీడు ఏఎంసీ చైర్మన్ పదవి దక్కించుకున్న బీజేపీ

» వైస్ చైర్మన్ పదవి టీడీపీకే.. డైరెక్టర్లుగా జనసేనకు ఛాన్స్?



నూజివీడులోని ఏఎంసీ

నూజివీడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ ప్రమాణ స్వీకారం ఎప్పుడో తేలలేదు. నూజివీడు మార్కెటింగ్ కమిటీ పదవి కూటమి పద్దులో అనూహ్యంగా బీజేపీకే కేటాయింపు జరిగింది. నూజివీడు నియోజకవర్గంలో తమ బలానికి మించి, ఏఎంసీ చైర్మన్ పదవి రావడం పట్ల బీజేపీ శ్రేణులే బిత్తరపోయాయి. ఈ పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న టీడీపీ శ్రేణులు నిరాశ చెందాయి. నూజివీడు నియోజకవర్గంలో ఈ పదవి ఎస్సీ మహిళకు కేటాయింపు జరిగింది. దీంతో నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి పార్థసారథి ఆగిరిపల్లి మండలానికి చెందిన ఒక ఎస్సీ మహిళ పేరు సిఫార్సు చేస్తూ దాంతోపాటు వైస్ చైర్మన్ డైరెక్టర్‌ల పేర్లతో కూడిన జాబితాను ప్రభుత్వానికి పంపారు. టీడీపీ అధిష్ఠానం ఈ చైర్మన్ అభ్యర్థి కోసం నియోజకవర్గంలో ఐవీఆర్ఎస్ సర్వే చేయించగా అనుకూలత రాకపోవడంతో మరో అభ్యర్థిని సూచించమని మంత్రి పార్థసారథికి స్పష్టం చేయడంతో ఆయన మరో పేరును సిఫార్సు చేసి పంపారు. ఏమైందో ఏమో గానీ అనూహ్యంగా ఏఎంసీ పేర్లను ప్రకటించే రోజున సాయంత్రం మూడు గంటలకు బీజేపీ జిల్లా రాష్ట్ర నాయకులు నూజివీడు బీజేపీ నాయకులకు ఫోన్ చేసి పది నిమిషాల వ్యవధిలో ఏఎంసీ చైర్‌పర్సన్‌కు అర్హత ఉన్న బీజేపీ మహిళ పేరు తెలపాలని ఆదేశించడంతో అప్పటికే ఏఎంసీ డైరెక్టర్ పదవి కోసం దరఖాస్తు చేసుకొని ఉన్న కె. అరుణ పేరును బీజేపీ నాయకులు సూచించడంతో సాయంత్రం కూటమి ప్రభుత్వం ఈ పేర్లు ఖరారు చేస్తూ ప్రకటన జారీ చేయడంతో నియోజకవర్గంలో కలకలం రేగింది. అరుణ కుటుంబీకులు వైసీపీ సానుభూతిపరులని వారి ఇంటిపైన జగన్ స్టికర్లు ఉన్న ఫోటోలు ఇటు వాట్సప్‌లోను, అటు బీజేపీ, టీడీపీ కార్యాలయాలకు ఫిర్యాదులు వెళ్లాయి. మరుసటి రోజుకు అన్నీ సర్దుకున్నాయి. అరుణ పేరును ప్రకటించిన మరుసటిరోజు నుంచి ఆమె స్థానిక బీజేపీ నాయకులతో కలిసి మంత్రి పార్థసారథితో పాటు కైకలూరు ఎమ్మెల్యే కామినేని తదితర జిల్లా ముఖ్య నాయకులను కలిసి ఆశీర్వాదం అందుకుంటున్నారు.

జీవో కోసం ఎదురుచూపులు..

ప్రభుత్వం నుంచి జీవో రాగానే ప్రమాణ స్వీకారం చేయడానికి బీజేపీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. చైర్మన్‌తో కలిసి మొత్తం 13 మంది సభ్యులు ఈ కమిటీలో ఉంటారు. వీరిలో ముగ్గురు వివిధ ట్రేడ్ల నుంచి ఎంపికవుతారు. మిగిలిన వారందరూ డైరెక్టర్లుగా ఉంటారు. వీరిలో ఒకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. వైస్ చైర్మన్‌గా టీడీపీకి చెందిన వారు ఉంటారని. జనసేన నుంచి ఇద్దరు లేదా ముగ్గురు డైరెక్టర్లు ఉంటారని తెలుస్తోంది.

డాక్టర్ మనోజ్‌కు సత్కారం



ముదినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు విజయవాడ రితిక ఫౌండేషన్ నుంచి నంది అవార్డును అందుకున్న ముదినేపల్లికి చెందిన డాక్టర్ అంబుల మనోజ్‌ను ఏపీటీఎఫ్ మండల నాయకులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆయన నివాసంలో సమాఖ్య జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షుడు కృపాకర్, ప్రధాన కార్యదర్శి డి. వెంకటరత్నం, సభ్యులు రెడ్డి శ్రీహరి, జాన్సన్‌బాబు, చక్రధర్, రవినాథ్, సుభానీ మనోజ్‌ను సన్మానించారు.



నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

ముదినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడాలి జడ్పీ హైస్కూల్లో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆ గ్రామ ప్రముఖులు అనగాని లీలావతి స్మృత్యర్థం నగదు అవార్డులను అందజేశారు. శుక్రవారం హెచ్ఎం ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన వై ఉషస్విని, ద్వితీయ స్థానం సాధించిన స్నేహలతకు రూ. 2500చొప్పున, 500 మార్కులకుపైన సాధించిన కృపాశాంతి, మణికంఠ, జెవి సుబ్రహ్మణ్యం రూ. 1500చొప్పున, తెలుగు మీడియంలో అత్యధిక మార్కులు సాధించిన వీఎన్ దుర్గ, ఎంవీఎన్ఎస్ ప్రసాద్‌కు రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేశారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, దాతలు అనగాని పెద వెంకటేశ్వరరావు, అనగాని దుర్గా ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ అనగాని గంగాధర రావు, ఎస్ఎంసీ చైర్మన్ గుర్రపు సుబ్రహ్మణ్యం, సభ్యుడు పరశురామయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారి మార్జిన్‌లో తుప్పల తొలగింపు

మంత్రి సారథికి పలువురి కృతజ్ఞతలు



చెక్కపల్లి రహదారి మార్జిన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గోగులంపాడు నుంచి చెక్కపల్లి వెళ్ళే ప్రధాన రహదారి మార్జిన్‌లో జంగిల్ రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో శుభ్రపడింది. ఈ రహదారి మార్జిన్ ముళ్ళకంచెలు, పిచ్చి మొక్కలతో మూసుకుపోయిందని, దీనితో ప్రమాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి సారథి దృష్టికి తీసుకువెళ్ళామని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు తెలిపారు. మార్జిన్‌ను శుభ్రం చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. శుక్రవారం సుమారు ఐదు కిలోమీటర్ల పొడవునా ఈ రహదారి ఇరువైపుల ఉన్న మార్జిన్‌లో జంగిల్‌ను రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక లెవల్ ట్రాక్టర్‌తో తొలగించారు. దీంతో రహదారి విశాలంగా మారడంతో మంత్రికి నాయకులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులను టీడీపీ నాయకులు కాటేపల్లి సత్యనారాయణ, మండలపు ధర్మరాజు, మల్లిబాబు తదితరులు పర్యవేక్షించారు.

ఇంటర్ బోర్డు పరిధిలోకి హైస్కూల్ ప్లస్‌లు!

(5వ పేజీ తరువాయి)

50 శాతం మార్కులున్న వారిని ప్రభుత్వ నిబంధనల మేరకు హైస్కూల్ ప్లస్‌లలో పీజీటీలుగా నియమించి, వారికిచ్చే జీత భత్యాలకు అదనంగా నెలకు రూ.2వేలు ఇన్సెంటివ్‌గా చెల్లిస్తున్నారు. ఆ మేరకు రెండేళ్లగా హైస్కూల్ ప్లస్‌లలో కొన్ని సదుపాయాలు, బోధనా సిబ్బందిని నియమించినా, వీటిలో అడ్మిషన్లు తీసుకునే బాలబాలికలు అతి స్వల్పసంఖ్యలో ఉండడం గమనార్హం. జిల్లాలో 33 హైస్కూల్ ప్లస్‌లుండగా, వీటిలో 26 మాత్రమే ప్రస్తుతం కొనసాగుతున్నాయి. మిగతా వాటిలో ఒక్క విద్యార్థీ లేకపోవడంతో రికార్డులకే పరిమితమయ్యాయి. ఇక ఈ ఏడాది 26 హైస్కూల్ ప్లస్‌లలో విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే 862 మందే ఉన్నారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల తీరును గమనిస్తే ఆరు చోట్ల ఒక్కరూ చేరకపోగా, మిగతా వాటిలో కేవలం 427 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్‌లో 435 మంది విద్యార్థులు చదువుతున్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం





దమ్ము చక్రాల కారణంగా దెబ్బతిన్న రహదారి (ఇన్‌సెట్) రహదారి పగిలిపోయిన దృశ్యం

చాట్రాయి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం-యడవల్లి గ్రామాల మధ్య రూ. 1.90 కోట్లు నాబార్డు నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం ఇటీవల పూర్తయ్యింది. వరినాట్లు సీజన్ కావటంతో ఈ రహదారిపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరగటం వలన కొన్ని చోట్ల బీటీ రోడ్డు దెబ్బతింది. కోట్లాది రూపాయల ప్రజా ధనం ఖర్చు పెట్టి వేసిన రహదారులు కొందరు ట్రాక్టరు యజమానులు, డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల కొద్ది రోజులకే దెబ్బతింటున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై దమ్ము ట్రాక్టర్లు తిరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ధ్వంసం



సైలెన్సర్లను పరిశీలిస్తున్న ఏలూరు ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేసినట్లు ఎస్పీ కేపీఎస్.కిశోర్ తెలిపారు. ఏలూరులో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చారు. తొలగించిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ కిశోర్ సమక్షంలో రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహనాలకు సంబంధిత కంపెనీలు ఇచ్చిన సైలెన్సర్లు కాకుండా ఎక్కువ శబ్దం వచ్చే వాటిని బిగించుకుని శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు తయారు చేసే కంపెనీలపై కూడా చర్యలు తీసుకుం టామన్నారు.

నంబర్ ప్లేట్‌పై స్టిక్కర్లు ఉంటే వాహనం సీజ్

కొంతమంది నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు అంటిస్తున్నారని అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండాలన్నారు. పిల్లల సౌకర్యం కోసం తల్లిదండ్రులు ద్విచక్ర వాహనా లను కొనిస్తున్నారని, వాటి ద్వారా సమస్యలను కూడా కొని తెచ్చుకోవద్దన్నారు. హైస్పీడు వాహనాలను పిల్లలకు ఇవ్వరాదని ఎస్పీ కిశోర్ సూచిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులతో పాటు తల్లి దండ్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ కె అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణబాబు, ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముదినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కొత్తపల్లి, ముదినేపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ డీఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదార్లు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తొలగిన సందిగ్ధత

ముదినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో కొత్తగా ఏర్పాటైన జిల్లా పరిషత్ హైస్కూలు - ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ఎవరు వ్యవహరించాలన్న విషయమై స్పష్టత ఇస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఉన్నా హైస్కూల్ హెచ్ఎం మాత్రమే ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఒకటి నుంచి ఐదు తరగతుల నిర్వహణ చూసుకుంటూ హైస్కూల్ హెచ్ఎం అప్పగించే బాధ్యతలను నిర్వర్తించాలని స్పష్టం చేశారు. దీంతో హైస్కూలు-కం-ప్రాథమిక పాఠశాల ఏర్పాటైన చోట ఉండే ఇద్దరు హెచ్ఎంల బాధ్యతల, విధులపై సందిగ్ధత తొలగింది.

ఆగస్టు 13న క్విట్ ఇండియా డే పాటించాలి : హరనాథ్

చాట్రాయి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న విదేశీ వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)కి వ్యతిరేకంగా ప్రజలు ఆగస్టు 13న క్విట్ ఇండియా డే పాటించాలని అఖిల భారత కిసాన్ మహాసభ జాతీయ కార్యదర్శి డి. హరనాథ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఢిల్లీలో సమావేశమైన సంయుక్త కిసాన్ మోర్చా ఈ మేరకు నిర్ణయం తీసుకొని, దేశవ్యాప్తంగా ఆగస్టు 13న ఎఫ్‌టీఏని వ్యతిరేకిస్తూ నిరసలు తెలపాలని పిలుపునిచ్చిందన్నారు. ఈ ఒప్పందం వల్ల దేశ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు సంఘాలన్నీ ఐక్యంగా ర్యాలీలు నిరసనలు చేపట్టి క్విట్ ఇండియా డేని విజయవంతం చెయ్యాలని కోరారు.



వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకుంటున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

ఆగిరిపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలోని బాల త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో సామూహిక లక్ష్మీ వ్రతాలు, ముక్తేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు, బాలా త్రిపుర సుందరి లక్ష్మీ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వరాహ పుష్కరిణి సమీపంలో గల దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీశ్యామలాంబకు ప్రత్యేక అలంకరణ

కైకలూరు: శ్రావణమాసోత్సవాల సందర్భంగా కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించు కుని పూజలు చేశారు. అమ్మవారికి పుష్పాలంకరణ పుల్లపర్రు గ్రామానికి చెందిన పూల ఆదినారాయణ చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పూల ఆదినారాయణ, అమీరపు వెంకట సూర్య అప్పారావు, తామరకొల్లుకు చెందిన సుబ్బారావు బ్రదర్స్, ఇందుకూరి వెంకటరామరాజు, నిమ్మల రమేష్ ఆర్థిక సాయంతో పంపిణీ చేశారు. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

క్రైమ్ కార్నర్

గోతిలో దిగబడిన వ్యాన్.. 15 మందికి గాయాలు

ముదినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా ముదినేపల్లిలో ఏర్పడిన పెద్ద గోతిలో శుక్రవారం సాయంత్రం ఒక మినీ వ్యాను దిగబడిపోయిన సంఘటనలో పలువురు గాయాలకు గురయ్యారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళుతుండగా వ్యాన్ పక్కనే ఉన్న గోతిలో దిగబడి ఒక పక్కకు ఒరిగిపోయింది. వ్యాన్‌లో ఉన్న ముదినేపల్లికి చెందిన 15 మంది ఒక్కసారిగా కింద పడిపోయారు. ఈ సంఘటనలో పలువురు మహిళలు డ్రైన్‌లో పడి గాయాలకు గురయ్యారు. వారిని స్థానికులు స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయించారు. విస్తరణ పనుల్లో భాగంగా తవ్వుతున్న డ్రైన్ల నిర్మాణంలో జాప్యం జరగడం ప్రమాదకరంగా తయారయింది.

రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం



గుర్తు తెలియని యువకుడి మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల వద్ద గుర్తు తెలి యని వ్యక్తి మృత దేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే హెచ్‌సీ ఎంఎస్ఎన్ ప్రసాద్ తన సిబ్బందితో శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 35 ఏళ్ల వయస్సు కల్గి 5.5 అడుగుల ఎత్తు, చామన చాయ శరీరంతో సామాన్య దేహధారుఢ్యంతో ఉన్నాడు. మృతుడు తెలుపు, నలుపు సిమెంటు రంగులతో కూడిన అడ్డ చారల పొట్టి చేతుల చొక్కా, టీ షర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని కుడిచేయి మణికట్టుపైన త్రిశూలం గుర్తు కల్గిన పచ్చబొట్టు ఉంది. అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. రైలు నుంచి జారి పడ్డాడా, రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు 99891 09912 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.